వైకాపా నేతల దొంగ బుద్ధులు

- నకిలీ పత్రాలతో నాడు సిఫార్సులు
- అనుకూలురకు దివ్యాంగ పింఛన్లు
- అక్రమాలపై విచారించని అధికారులు

'గిద్దలూరు నియోజకవర్గంలో దివ్యాంగుల కోటా కింద దొంగ ధ్రువీకరణ పత్రాలు సమర్పించి సుమారు మూడు వేల మంది పింఛన్లు తీసుకుంటున్నారు. చెవిటి, కంటి చూపు విభాగాల్లోనే ఎక్కువ. గత ప్రభుత్వ హయాంలో వైద్యాధికారులపై ఒత్తిడి తెచ్చి తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించారు. అందుకు గిద్దలూరు ప్రాంతంలో కొందరు ముఠాలుగా ఏర్పడి దండుకున్నారు. సమగ్ర విచారణ చేపట్టి అనర్హులను తొలగించాలి. అర్హులకు న్యాయం చేయాలి..'

ఇవీ కలెక్టరేట్‌లో ఇటీవల నిర్వహించిన జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయ సమావేశంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి వ్యాఖ్యలు.

– న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం



సామాజిక భద్రతా పింఛన్లలో భాగంగా విభిన్న ప్రతిభావంతుల విభాగంలో కొందరు దొంగలు చొరబడ్డారు. అర్హులు కాకున్నా అప్పటి అధికార వైకాపా నేతలను ప్రసన్నం చేసుకున్నారు. మరి కొందరు దళారులను ఆశ్రయించి కాసులు అప్పగించారు. దీంతో మానసికంగా, శారీరకంగా బాగున్నా.. వైకల్యం ఉన్నట్లు సదరమ్ స్లాట్ల సమయంలో స్థానిక వైద్యాధికారుల సిఫార్సుతో దొంగ పత్రాలు సృష్టించారు. వాటి ఆధారంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుని దివ్యాంగుల పింఛను కింద నెల నెలా లబ్ధి పొందుతున్నారు. ఈ వ్యవహారంపై అధికార పార్టీ ఎమ్మెల్యేలు కూడా విచారణ చేయించాలని ఫిర్యాదు చేశారు. అయినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేవు.

శిబిరాలకు వెళ్లకుండానే పత్రాలు...: నలభై శాతం వైకల్యంతో బాధపడుతున్న వారికి నెలకు ఒక్కొక్కరికి రూ.3 వేలు చొప్పున పింఛను ఇవ్వనున్నట్లు గత వైకాపా ప్రభుత్వం ప్రకటించింది. ఇదే అదునుగా అప్పటి అధికార పార్టీ నేతల అండతో దళారులు రంగంలోకి దిగారు. నిబంధనలను తుంగలో తొక్కి అక్రమాలకు తెర లేపారు. డబ్బులు తీసుకుని అడ్డగోలుగా వ్యవహరించారు. అక్రమ మార్గంలో కొందరికి పింఛను ఇప్పించారు. సదరం శిబిరాలకు వెళ్లకుండానే దివ్యాంగులని చూపేలా పన్నాగం పన్నారు. చెవుడు, కంటి చూపు తదితర విభాగాల్లో వైకల్యం ఉన్నట్లు వైద్యులపై ఒత్తిడి తెచ్చి పత్రాలు పొందారు. వాటి సాయంతో ధ్రువీకరణ పత్రాలు తయారు చేయించి పింఛనుకు దరఖాస్తు చేసుకున్నారు. క్షేత్ర స్థాయిలో వాలంటీర్ల ద్వారా ప్రతిపాదనలు అందడంతో మండల, జిల్లా అధికార యంత్రాంగం కూడా కిమ్మన లేదు. అనర్హులకు మంజూరు చేశారు. ప్రజాధనాన్ని తమ అనుకూలురకు అప్పనంగా వడ్డించారు.



మొత్తం సామాజిక పింఛను విభాగాలు	17	జిల్లా వ్యాప్తంగా లబ్ధిదారులు:	2,88,144	విడుదలైన నగదు:	రూ.122.64 కోట్లు (అక్టోబర్ నెల కింద)	దివ్యాంగుల కోటా లబ్ధిదారులు:	33,538 (ఇందులో సగం మంది అనర్హులనే ఆరోపణలు ఉన్నాయి)	ప్రతి నెలా పంపిణీ :	రూ.20.12 కోట్లు

ఆరంచెలంటూ అర్హుల తొలగింపు...

గత వైకాపా ప్రభుత్వం ఆరంచెల విధానం అమలు చేసింది. అందులో పలు సాంకేతిక సమస్యల కారణంగా అర్హులు పింఛను కోల్పోయారు. మరోపక్క అనర్హులు లబ్ధి పొందారు. దివ్యాంగుల పింఛన్లపై సమగ్ర విచారణ కోరుతూ గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కలెక్టరేట్ నుంచి జీజీహెచ్ సమన్వయ కర్తకు గతంలో లేఖ రాశారు. కానీ ఇంతవరకు విచారణ ముందుకు సాగలేదు. ఈ నేపథ్యంలోనే అనర్హుల ఏరివేత, అదే సమయంలో అర్హులకు పింఛన్లు అందజేసేందుకు త్వరలో మార్గదర్శకాలు ఇవ్వనున్నట్లు కూటమి ప్రభుత్వం ప్రకటించింది. దీంతో గత ప్రభుత్వ హయాంలో దొడ్డిదారిన పింఛను పొందినవారిలో ఇప్పుడు అలజడి నెలకొంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి లబ్ధిదారుల జాబితాపై విచారణ చేయిస్తే అక్రమార్కుల బాగోతం వెలుగు చూసే అవకాశముంది.


అదరగొట్టిన ఆంధ్రా

- జిల్లాలో ముగిసిన పొగాకు కొనుగోళ్లు
- సీజన్‌లో ఈ ఏడాదే అత్యధిక లాభాలు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే:

ఏటా నష్టాలతో రైతులను పలకరించిన పొగాకు పంట.. గత రెండేళ్లుగా వారికి బాసటగా నిలిచింది. మార్కెట్‌లో మంచి ధరలు లభించడం వారిలో జోష్ నింపుతోంది. గత నవంబర్, డిసెంబర్ నెలల్లో కురిసిన భారీ వర్షాలకు సగం మేర విస్తీర్ణంలో పంట దెబ్బతింది. మళ్లీ సాగు చేయాల్సి రావడంతో పెట్టుబడులు రెట్టింపయ్యాయి. ఈ పరిస్థితుల్లో ఓ పట్టు ఆపు కొంటారా.. మరోవైపు నాట్లు వేయాల్సి వచ్చింది. పైగా ఈ సారి ఫిబ్రవరిలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో మొక్క ఎదుగుదల లోపించింది. ఈ నేపథ్యంలో మార్కెట్‌లో లభించే ధరలపై రైతులు తొలినాళ్లలో ఆందోళన చెందారు. వేలం ప్రారంభంలో మేలిమి రకం కిలో రూ.230 ఉండగా ఆ తర్వాత అన్ని రకాల గ్రేడ్‌లకు క్రమేణా ధరలు పెరిగాయి. మేలిమి రకం కిలో గరిష్ఠ ధర రూ.365 చొప్పున లభించింది. ఇంత ధర లభించడం ఆంధ్రా సీజన్‌లో ఇదే తొలిసారి కావడం గమనార్హం.

కనిగిరిలో తక్కువ.. టంగుటూరులో ఎక్కువ...: జిల్లా వ్యాప్తంగా తొలి విడతగా ఈ ఏడాది ఫిబ్రవరి 29న, మార్చి 6న పొగాకు కొనుగోళ్లు ప్రారంభించగా, సోమవారంతో అమ్మకాలు పూర్తయ్యాయి. కనిగిరిలో అత్యల్పంగా 136 రోజులు; అత్యధికంగా టంగుటూరు కేంద్రంలో 162 రోజులపాటు వేలం ప్రక్రియ సాగింది. సుమారు 49 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. 2023-24 సీజన్‌కు 86.93 మి.కిలోల మేర పంట ఉత్పత్తికి అనుమతి ఇవ్వగా., గత ఏడాది కూడా మార్కెట్లో ధరల పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది అత్యధిక విస్తీర్ణంలో రైతులు సాగు చేశారు. 152.50 మి.కిలోల మేర ఉత్పత్తికి అమ్మకాలు సాగాయి. బోర్డు అనుమతి కంటే 65.76 మి.కిలోల పంట ఉత్పత్తి అధికం. గత ఏడాదితో పోలిస్తే ఈ సారి సగటున కిలో సుమారు రూ.54 మేర ఎక్కువ లభించింది. అత్యధిక ధర రూ.365, అత్యల్ప ధర రూ.50 పలికింది. వ్యాపారులు పోటీ పడి లోగ్రేడ్ రకానికి కూడా మేలిమి రకం ధర చెల్లించారు. తద్వారా బ్యారన్‌కు రూ. 3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఆదాయం సమకూరింది.



వేలం కేంద్రాల వారీగా అమ్మకాలు, లభించిన ధరలు... (2023-2024 సీజన్)

వేలం కేంద్రం	పంట అమ్మకాలు (మి.కిలోల్లో)	సరాసరి ధర (రూ.ల్లో)
వెల్లంపల్లి	15.02	276.17
ఒంగోలు-I	18.58	272.55
ఒంగోలు-2	13.80	265.05
టంగుటూరు	16.71	272.17
కొండపి	17.50	266.42
పొదిలి	14.73	263.79
కనిగిరి	7.95	252.60

రసాయనాల్లేని కూరగాయలతో ఆరోగ్యం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: రసాయనాలు లేకుండా సాగు చేసిన కూరగాయలతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని.. ఆ దిశగా వినియోగానికి ప్రజలు ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా కోరారు. సేంద్రియ విధానంలో పండించిన కూరగాయల విక్రయ కేంద్రాన్ని ఒంగోలు ప్రకాశం భవన్ వద్ద ఆమె సోమవారం ప్రారంభించారు. సేంద్రియ వ్యవసాయానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ఆ విధానంలో సాగు చేసేందుకు ముందుకొచ్చిన రైతులకు మద్దతుగా నిలవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మరిన్ని విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయించాలని డీపీఎం సుభాషిణిని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ రైతుల వద్ద కూరగాయలు కొనుగోలు చేశారు.

10 నాటికి కరవు మండలాల ప్రతిపాదనలు...: ఈ నెల 10వ తేదీ నాటికి జిల్లాలోని కరవు మండలాలకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, జల వనరులు, భూగర్భ జల శాఖల అధికారులతో ఒంగోలు ప్రకాశం భవన్‌లోని ఛాంబర్‌లో సోమవారం ఆమె సమావేశమయ్యారు. నమోదైన వర్షపాతం వివరాలు, వ్యవసాయపరంగా గతంలో ఎంత విస్తీర్ణంలో సాగు చేశారో పరిశీలించారు. సమావేశంలో డీఆర్వో శ్రీలత, సీపీవో వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ జోసఫ్ కుమార్, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారిణి బేబీరాణి, భూగర్భ జల వనరుల శాఖ డీడీ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.


సేంద్రియ ఉత్పత్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా.. చిత్రంలో డీపీఎం సుభాషిణి



స్కందమాతా.. నమో నమామీ


ప్రసిద్ధినొందిన త్రిపురాంతకం బాలాత్రిపురసుందరీదేవి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. అయిదో రోజైన సోమవారం స్కంద మాత అలంకారంలో మయూర వాహనంపై భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. వేద పండితుల ఆధ్వర్యంలో ఉభయదాతలు, భక్తులు కలిసి ఉత్సవమూర్తికి తొలుత ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చేపట్టిన ఊరేగింపులో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, త్రిపురాంతకం గ్రామీణం

ఇలా నియామకం.. అలా నిలిపివేత!

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ప్రకాశం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ(డీఎంఅండ్‌హెచ్‌వో) అధికారిణిగా పి.రత్నావళి నియామకం.. కొద్ది సమయానికే మళ్లీ నిలిపివేత ఉత్తర్వుల అంశం చర్చనీయాంశమైంది. 2020-22 మధ్య డీఎంఅండ్‌హెచ్‌వోగా రత్నావళి జిల్లాలో పని చేశారు. ప్రస్తుతం విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్‌గా కొనసాగుతున్నారు. ప్రకాశం డీఎంఅండ్‌హెచ్‌వోగా రాజ్యలక్ష్మి ఇటీవల ఉద్యోగ విరమణ చేయడంతో.. జిల్లా క్షయ నివారణ అధికారి సురేష్ కుమార్ ప్రస్తుతం ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు. రత్నావళి జిల్లాలో పనిచేసిన సమయంలో పలు అభియోగాలు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు అభ్యర్థుల ఎంపికలో ఆమెపై భారీగా ఫిర్యాదులు వచ్చాయి. నకిలీ ధ్రువపత్రాల ఆధారంగా ఉద్యోగాలు ఇచ్చారని పలువురు అభ్యర్థులతో పాటు, దళిత సంఘాల నాయకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ విషయమై ఇప్పటికే విచారణ చేపట్టి డైరెక్టర్ కార్యాలయానికి ఆమెను సరెండర్ చేశారు. ఈ క్రమంలోనే తిరిగి జిల్లాకు రత్నావళిని డీఎంఅండ్‌హెచ్‌వోగా నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు రావడం చర్చనీయాంశమైంది. ఆ తర్వాత కొద్దిగంటలకే వాటి అమలును నిలుపుదల చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ నిర్ణయించడం గమనార్హం.


రత్నావళి



కరవు నేలలో విరుల సోయగం

బంగారు వర్ణంలో మెరిసే బంతిపూలు ఓ వైపు.. ఆ వెనుకే పచ్చ రంగు చీర కట్టినట్లు కనిపించే నల్లమల కొండలు.. తురిమెళ్ల మీదుగా కంభం - గిద్దలూరు వెళ్లే ప్రధాన రహదారిలోని ఈ దృశ్యాలు కనువిందు చేస్తుంటాయి. కరవు నేలగా పేరొందిన పశ్చిమ ప్రకాశం ప్రకృతి అందాలకు పుట్టినిల్లు. ఇక్కడి నల్లమల అడవులు జీవ వైవిధ్యానికి నెలవు. అటువంటి ప్రదేశంలో కొందరు రైతులు బంతి పూల సాగు చేపట్టారు. ప్రస్తుతం చేలు పూలతో నిండి చూపరులను అమితంగా ఆకర్షిస్తున్నాయి. – న్యూస్‌టుడే, కంభం

జాతీయ రహదారుల విస్తరణ, రైల్వే లైన్ల నిర్మాణం, నూతన జిల్లా ఏర్పాటు ప్రకటన వంటి పరిణామాలతో పశ్చిమ భూముల ధరలకు రెక్కలొచ్చాయి. వై.పాలెం, త్రిపురాంతకం, పెద్దారవీడు, దోర్నాల, మార్కాపురం, కంభం, బేస్తవారపేట, గిద్దలూరు, పొదిలి మండలాల్లో స్థిరాస్తి వెంచర్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఈ అంశం ఇప్పుడు రిజిస్ట్రేషన్ శాఖలోని కొందరు అధికారులకు బంగారు బాతులా మారింది. వ్యవసాయ భూమిని ప్లాట్లుగా మార్చేందుకు భూ మార్పిడి, సంబంధిత పంచాయతీ/మున్సిపల్ అనుమతి, డీటీసీపీ అనుమతులు అవసరం. ఇవేమీ లేకుండానే ఒక్కో వెంచర్ నుంచి రూ.లక్షల్లో పుచ్చుకుని రిజిస్ట్రేషన్ చేస్తున్నారనే విమర్శలున్నాయి. కాసులివ్వకుంటే దస్తావేజులు తయారు చేయొద్దంటూ లేఖరులకు కొందరు ఉద్యోగులు హుకుం జారీ చేస్తున్నారు. దస్తావేజులు ఉండని గ్రామ కంఠం, పట్టా భూములకు ధర నిర్ణయించి రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. – న్యూస్‌టుడే, యర్రగొండపాలెం

కాసుల కక్కుర్తి.. పట్టుకున్నా మాకేంటీ!

- బంగారు బాతుల్లా అక్రమ వెంచర్లు
- ఏసీబీకి దొరికినా కానరాని చర్యలు
- బరితెగిస్తున్న 'రిజిస్ట్రేషన్' ఉద్యోగులు

'ఫ్రీహోల్డ్' భూములకు రూ. లక్షలు...: ఇరవై ఏళ్ల క్రితం అసైన్డ్ చేసిన ప్రభుత్వ భూములకు హక్కులు కల్పిస్తూ, వాటిని అమ్ముకోవచ్చని వైకాపా ప్రభుత్వం తెచ్చిన 'ఫ్రీ హోల్డ్' చట్టం అటు రెవెన్యూ, ఇటు రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు కాసులు కురిపిస్తోంది. వై.పాలెం పరిధిలో దాదాపు 500 ఎకరాలు, మార్కాపురం పరిధిలో 600 ఎకరాల వరకు ఇప్పటికే లావాదేవీలు సాగాయి. గిద్దలూరు, కంభం ప్రాంతాల్లోనూ ఈ తరహా రిజిస్ట్రేషన్లు అధికంగానే ఉన్నాయి. జాతీయ రహదారులు, పట్టణాల సమీపంలో ఉన్న అసైన్డ్ భూములు ఫ్రీహోల్డ్ కావడంతో వాటి విలువ పెరిగింది. దీంతో కొనుగోలు చేసిన యజమానులు రిజిస్ట్రేషన్‌కు రూ.లక్షలు సమర్పించుకున్నారు. వై.పాలెం సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసేందుకు అధికారులు ఆసక్తి చూపిస్తుంటారు. ఇతర జిల్లాలో పనిచేస్తున్న సబ్-రిజిస్ట్రార్‌లు ఇక్కడికి డిప్యుటేషన్‌పై రావడం, ఏళ్ల తరబడి పనిచేస్తుండడం అందుకు నిదర్శనం.

ఎటూ తేలని విచారణలు...: ఇటీవల సస్పెన్షన్‌కు గురైన వై.పాలెం సబ్ రిజిస్ట్రార్ హేమలత ఆ కుర్చీలో నెలల తరబడి ఎఫ్ఏసీగానే విధులు నిర్వర్తించారు. ఇంకొల్లు నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన ఆమె.. ఏకంగా రికార్డుల్లో లేని సర్వే నంబరుతో రిజిస్ట్రేషన్ చేయడం గమనార్హం. హేమలత 2017 మార్చిలో చీమకుర్తి సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న సమయంలోనూ ఏసీబీ అధికారులు దాడులు చేశారు. కార్యాలయంలో అనధికారికంగా ఉన్న రూ. 30 వేల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అదే కార్యాలయంలో 2019 మేలో ఆమె పనిచేస్తున్న సమయంలోనే ఏసీబీ అధికారులు అక్కడ అనధికారికంగా పనిచేస్తున్న ఓ వ్యక్తి నుంచి రూ. 1.03 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆస్తుల క్రయదారుల నుంచి ఫీజు టు ఫీజు వసూళ్లు చేస్తున్నట్లు గుర్తించారు. అనంతరం ఆ రెండు కేసులూ శాఖాపరమైన విచారణకు నోచుకోలేదు. సదరు దస్త్రాలు మూలకు చేరాయి. రాజకీయ జోక్యం, పలుకుబడి, ఉన్నత స్థాయిలో లోపాయికారీ ఒప్పందాలే కారణమనే విమర్శలున్నాయి. ఈ ఉదాసీనతే అక్రమార్కులకు వరంగా మారుతోంది. పట్టుకున్నా మాకేం కాదనే భరోసానిస్తున్నాయి. దీంతో అందిన కాడికి దండుకుంటూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు.



గ్రానైట్‌పై వసూళ్ల పిడుగు

- 'ప్రైవేట్' పెత్తనానికి గత ప్రభుత్వం ప్రయత్నాలు
- పాత విధానాన్ని సమీక్షించని కూటమి సర్కారు



ఈనాడు, ఒంగోలు:

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గెలాక్సీ గ్రానైట్ నిక్షేపాలకు చీమకుర్తి నెలవు. జిల్లా నుంచి ప్రభుత్వానికి ఏటా రూ.300 కోట్ల వరకు ఆదాయం సమకూరుతుంటుంది. మరో రూ.100 కోట్లు అదనపు ఆదాయం కోసం రాయల్టీ వసూలును గత వైకాపా ప్రభుత్వం ప్రైవేట్‌కు కట్టబెట్టేందుకు ప్రయత్నాలు చేసింది. గ్రానైట్ క్వారీలు, లీజుదారుల నుంచి సీనరేజ్ వసూలు చేయడం, పర్మిట్ల జారీని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేలా 2021 ఆగస్టులో ఉత్తర్వులు జారీ చేసింది. గనుల శాఖ అధికారులు, లీజుదారులు, గుత్తేదారులలో ఎవరి పాత్ర ఏమిటో వాటిల్లో స్పష్టంగా పేర్కొంది. అనంతరం కీలక నిబంధనలు మార్చేసి అంతిమంగా ప్రైవేట్ వ్యక్తులకు మేలు చేసేలా వ్యవహరించింది. ప్రభుత్వ అధికారుల పాత్రను నామమాత్రం చేసింది. ఈ విధానాన్ని రాష్ట్రంలోని ఏడు ఉమ్మడి జిల్లాల్లో అమలు చేసినా. . ప్రకాశంలో ఎవరూ ముందుకు రాకపోవడంతో గనుల శాఖ అధికారులే సీనరేజ్ వసూలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఈ అంశంపై పునఃసమీక్షిస్తుందని ఆశించారు. అయితే జిల్లాలోనూ ఆ విధానం సాధ్యాసాధ్యాలను పరిశీలించి ఈ నెల 10వ తేదీలోపు నివేదిక ఇవ్వాలని జిల్లా గనుల శాఖ అధికారులను ప్రభుత్వం కోరినట్లు సమాచారం. దీంతో పలువురు పరిశ్రమల నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు.

అమలుతో ఇవీ ఇబ్బందులు...: గ్రానైట్ గనుల్లో క్యూబిక్ మీటరు చొప్పున ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించేలా యజమానులు లీజులు తీసుకుని, ఆ మేరకు తవ్వకాలు సాగిస్తుంటారు. నిబంధనల మేరకు తవ్వకాలు సాగిస్తున్నదీ లేనిదీ విజిలెన్స్, గనుల శాఖ అధికారులు నిఘా ఉంచుతారు. గత వైకాపా ప్రభుత్వం క్యూబిక్ మీటర్ల చొప్పున ఉన్న రాయల్టీ విధానాన్ని టన్నేజీకి మార్పు చేయాలని యోచించింది. ఇందులో భాగంగా వాహనాల్లోకి రాయిని ఎక్కించిన తర్వాత తూకం వేయించి, బరువును బట్టి ఆన్‌లైన్‌లో రాయల్టీ చెల్లించేలా మార్పు చేయాలని తలచింది. క్యూబిక్ మీటర్ల విధానంలో గ్రానైట్ రాయిని నాలుగు వైపులా సరిచూసుకుని పరిమాణాన్నిబట్టి రాయల్టీ ఉంటుంది. దీంతో కటింగ్, పాలిషింగ్ యూనిట్లకు పెద్దగా నష్టం ఉండేది కాదు. జీవో నంబరు 47 ప్రకారం టన్నేజీ విధానంతో రాయి మూలలు, నాణ్యతతో సంబంధం లేకుండా ఎంత బరువుంటే అంత రుసుము చెల్లించాల్సి వస్తుంది. దీంతో వ్యర్థాలకు కూడా రాయల్టీ చెల్లించాల్సి వస్తుందని కొనుగోలుదారులు, కటింగ్, పాలిషింగ్ యూనిట్ల యజమానులు వాపోతున్నారు.

త్వరలో నివేదిక అందిస్తాం...: రాజశేఖర్, డీడీ, గనుల శాఖ

క్యూబిక్ మీటర్ల చొప్పున ఉన్న రాయల్టీని టన్నేజీకి మార్చేందుకు గతంలో ప్రయత్నాలు సాగినా అమలు కాలేదు. గత ప్రభుత్వంలోనే టెండర్ ద్వారా రాయల్టీ వసూలును రాష్ట్రంలోని ఏడు ఉమ్మడి జిల్లాల్లో ప్రైవేట్‌కు అప్పగించారు. ప్రకాశంతో పాటు మరో ఆరు జిల్లాల్లో ఈ విధానం అమలుకాలేదు. ఇప్పుడు ఆయా చోట్ల రాయల్టీ వసూలును ప్రైవేట్‌కు అప్పగించడంపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం కోరింది. ఇది సీనరేజ్ వసూలుకు సంబంధించింది మాత్రమే. ఆ మేరకు అన్ని అంశాలను పరిశీలించి నివేదిక అందజేస్తాం.



నాట్య మయూరాల వైభవం

శాస్త్రీయ, జానపద నృత్యాలతో ఒంగోలులోని తితిదే కల్యాణ మండపం సోమవారం హోరెత్తింది. ఇంతకాలం తాము నేర్చుకున్న నృత్యాన్ని విద్యార్థులు ఇక్కడి వేదికపై చూడచక్కగా ప్రదర్శించారు. ప్రతిగా ఆహూతుల నుంచి కరతాళ ధ్వనులను బహుమతిగా పొందారు. తమకు ఇంతకాలం శిక్షణ ఇచ్చిన గురువుకు నృత్యాంజలి సమర్పించారు. – ఈనాడు, కొత్తపట్నం

రైతేరాజు ఏడాదంతా పంట... భలే లాభాలంట! 6 లో..



దాత సాయం.. మార్గం సుగమం



చిన్నపాటి వర్షానికే జారుడు బల్లలా మారుతున్న ఆ రోడ్డును బాగుచేయించేందుకు ఓ దాత ముందుకొచ్చారు. ముండ్లమూరు మండలం పసుపుగల్లు నుంచి ఈదర వరకు సుమారు 12 కిలోమీటర్లు తారు రోడ్డు నిర్మాణానికి గత తెదేపా ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. నాలుగు కిలోమీటర్ల మేర వేములబండ సమీపం వరకు రోడ్డు వేసి గుత్తేదారు వదిలేశారు. వైకాపా అయిదేళ్ల పాలనలో ప్రజలు, ప్రయాణికులు గుంతల దారిలోనే రాకపోకలు సాగించారు. ఇటీవల వర్షాలకు ఆ దారి మరింత దుర్భరంగా మారింది. దీంతో వేములబండ గ్రామానికి చెందిన తెదేపా సీనియర్ నాయకుడు, మాజీ ఉపసర్పంచి కంచుమాటి శ్రీనివాసరావు సొంత నిధులు రూ.2 లక్షలు వెచ్చించి వేములబండ నుంచి రమణారెడ్డిపాలెం వరకు నాలుగు కిలోమీటర్లు మేర దారి పక్కన చిల్లచెట్లు తొలగించి, మట్టితోలి గుంతలు పూడ్చించి చదును చేయించారు. -న్యూస్‌టుడే, ముండ్లమూరు

భూ సమస్యల పైనే ఎక్కువ వినతులు

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి అన్నారు. సింగరాయకొండ మండల పరిషత్తు కార్యాలయం వద్ద సోమవారం తహసీల్దార్ రవి ఆధ్వర్యంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో ప్రజల సమస్యలపై ఆయన అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 90 వినతులు రాగా, అధికంగా భూ సమస్యలపైనే ఉన్నాయన్నారు. అయిదేళ్ల వైకాపా పాలనలో ఆ పార్టీ నేతలు నిరుపేదలకు అందించిన అసైన్డ్, ప్రభుత్వ భూములను ఆక్రమించి, లేఅవుట్లు వేసి రూ.కోట్లు దోచుకున్నారని తెలిపారు. సింగరాయకొండ ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న కాలువల ఆక్రమణలు తొలగించాలని, ఇతర సమస్యలను గ్రామస్థులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్తు సమస్యలు పరిష్కారం కాకపోవడంపై అధికారుల తీరుపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో అభివృద్ధి పనులకు రూ.140 కోట్లు మంజూరయ్యాయని, ఈ నెల 14న పల్లెపండుగ కార్యక్రమం ద్వారా ప్రారంభిస్తామన్నారు. కొండపి



అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి స్వామి, వేదికపై అధికారులు

నియోజకవర్గంలో రహదారులు, కాలువల నిర్మాణాలకు రూ.17 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. అనంతరం కనుమళ్ల జాతీయ రహదారి వద్ద బ్లాక్ స్పాట్లు గుర్తించి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, ఎంపీడీవో జయమణి, సీఐ హజరత్తయ్య, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: మీ కోసం అర్జీల పరిష్కారం పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరించారు. స్థానిక ప్రకాశం భవన్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన మీ కోసంలో ఆమె వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్థానికంగా పరిష్కరించదగ్గ సమస్యలను స్థానికంగానే పరిష్కరించాలని సూచించారు. అర్జీదారులతో మాట్లాడిన ఫొటోలతోపాటు, పరిష్కరించిన ఎండార్స్‌మెంట్‌ను కూడా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. పలు సమస్యలపై 241 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో శ్రీలత, ఎస్‌డీసీలు కుమార్, వెంకట సుబ్బయ్య, వరకుమార్‌తోపాటు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ, ఇతర అధికారులు

● **మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు పంపండి..**: ఎస్సీ నివాస ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి కార్యాచరణ ప్రతిపాదనలను తయారు చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రకాశం భవన్‌లో డిసెంబర్ నెలాఖరులోపు మౌలిక సదుపాయాల కల్పన కార్యాచరణపై సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రధాన రహదారులను కలిపే కాంక్రీట్ రోడ్లు, మురుగు కాలువలు, సురక్షిత తాగునీరు, గృహనిర్మాణం వంటి అంశాలు ఉన్నాయన్నారు. క్షేత్ర స్థాయి సమాచారం పంపించేందుకు ఈ నెల 15వ తేదీ గడువు అని తెలిపారు. సమావేశంలో జేసీ గోపాలకృష్ణ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి లక్ష్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 54...

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం అదనపు ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమానికి 54 వినతులు వచ్చాయి. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలను వివరించారు. వారితో అదనపు ఎస్పీ ముఖాముఖి మాట్లాడి, అర్జీలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, తాలూకా సీఐ కె.అజయ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు పాల్గొన్నారు.

గుండ్లకమ్మ కాలువ ఆక్రమణపై ఫిర్యాదు

ఒంగోలు గ్రామీణం: మాజీ ఎమ్మెల్యే టీజేఆర్.సుధాకర్‌బాబు గుండ్లకమ్మ కాలువ ఆక్రమించి అతిథిగృహం, దుకాణ సముదాయం నిర్మిస్తున్నారని నాగులుప్పలపాడు మండలం మద్దిరాల ముప్పాళ్ల గ్రామానికి చెందిన జెట్టి చెన్నకేశవ సోమవారం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేశారు. మద్దిపాడు మండలం మల్లవరంలోని సర్వే నం.69, 238, 239లో మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సోనియా చార్లీ గ్లోబల్ బిజినెస్ సంస్థ పేరిట భూములు కొనుగోలు చేసి గుండ్లకమ్మ కాలువలను ఆక్రమించి, దుకాణ సముదాయం, రెస్ట్ బంగ్లాలను నిర్మించినట్లు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సదరు ఆక్రమణల ద్వారా నీటి ప్రవాహం తగ్గి, రైతులకు ఇబ్బంది ఏర్పడినట్లు వివరించారు. ఆయా నిర్మాణాల పక్కనే ఉన్న దేవాదాయ భూములను కూడా ఆక్రమించినట్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తక్షణమే సర్వే చేయించి, అక్రమ నిర్మాణాలను తొలగించాలని కోరారు.

ఏడాదంతా పంట... భలే లాభాలంట!





న్యూస్‌టుడే – దర్శి

సాధారణంగా పుచ్చ పంటను జనవరి నెలలో విత్తనాలు నాటి... వేసవిలో దిగుబడి వచ్చేలా రైతులు సాగు చేస్తుంటారు. ఇందుకు భిన్నంగా ఏడాదిలో మూడు సార్లు సాగు చేస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నారు... కురిచేడు గ్రామానికి చెందిన రైతులు మేదరమెట్ల సుబ్బారెడ్డి, కమతం నాగిరెడ్డి. గత ఏడాదే ప్రయోగాత్మకంగా నాలుగు ఎకరాల్లో ఈ విధానానికి శ్రీకారం చుట్టారు. ఫలితాలు బాగుండడంతో ఈ ఏడాది మరో ఆరు ఎకరాలకు విస్తరించారు.

▶ **ప్రతి నాలుగు నెలలకోసారి...**: ఓసారి తోట వేసి దిగుబడి పూర్తయిన తరువాత మొత్తం పొలాన్ని శుభ్రం చేసి... పశువుల ఎరువుతో నేలను సత్తువ చేసి మళ్లీ విత్తనాలు వేస్తున్నారు. ఇలా ప్రతి నాలుగు నెలలకు ఓసారి చొప్పున ఏడాదికి మూడు పంటలు వేస్తున్నారు. పల్నాడు జిల్లా వినుకొండలో ఐసుబాక్స్ (నల్ల పుచ్చ) రకం విత్తనాలు సేకరించి... మల్చింగ్ విధానంలో నాటుతున్నారు. పంట అంతటికీ సమంగా నీరందేలా డ్రిప్ ఏర్పాటు చేశారు. బలం మందులు సైతం దాని ద్వారానే అందిస్తున్నారు. పుచ్చలో అధికంగా వచ్చే పండు ఈగ నివారణకు లింగాకర్షక బుట్టలు, రసం పీల్చే పురుగు, వైరస్ తెగుళ్లు ఆశించకుండా జిగురు అట్టలతో పాటు స్వల్ప మోతాదులో రసాయన మందులు వినియోగించారు. ఎక్కువ శాతం సేంద్రియ ఎరువులే వాడారు. ఈ చర్యలు ఫలించి మంచి పరిమాణంలో నాణ్యమైన కాయలు దిగుబడిగా వచ్చాయి. సాధారణంతో పోలిస్తే 30 శాతం మేర పెట్టుబడి ఖర్చులు తగ్గినట్లు రైతులు తెలిపారు.

▶ **పొలం వద్దే కొనుగోళ్లు...**: ఎకరాకు సగటున 18 టన్నుల మేర దిగుబడి సాధించారు. మార్కెట్లో టన్ను ధర రూ.14 వేల వరకు పలుకుతోంది. ఎకరాకు మొత్తంగా రూ.70 వేల వరకు పెట్టుబడి కాగా... పంట అమ్మకం ద్వారా రూ.2 లక్షల మేర ఆదాయం వస్తుందని రైతులు వివరించారు. ఆశాజనకంగా ఉండడంతో ఈ ఏడాది మరో ఆరు ఎకరాలకు సాగు విస్తరించారు. మరో పక్షం రోజుల్లో ఆ పంట కోతకు రానుంది. దిల్లీ, చెన్నై, హైదరాబాద్ వంటి పట్టణాల్లో ఉన్న బహుళజాతి సంస్థల మాల్‌లకు సంబంధించిన ప్రతినిధులు నేరుగా పొలం వద్దకే వచ్చిన కొనుగోలు చేస్తున్నారు. దీనివల్ల కోత, రవాణా ఖర్చులు ఆదా అవుతున్నాయి.

సమస్య-పరిష్కారం

● **సమస్య:** మండలంలోని కొన్ని గ్రామాల్లో నోటి పుండ్లు వచ్చి మేత సరిగా తినలేకపోతున్నాయి. నివారణ ఎలా? – వేల్పుల అంకమ్మరావు, మద్దిపాడు

పరిష్కారం: పుండ్లపై బోరిక్ ఆమ్లం పూస్తే కొంత ఉపశమనం కలుగుతుంది. పూర్తిగా తగ్గేందుకు యాంటీ బయోటిక్ మందులు వాడాలి. నీరస పడకుండా అంబలి, గంజి, నీరు ఎక్కువగా తాగించాలి.



డి.తిరుమలరెడ్డి, పశు వైద్యాధికారి, దొడ్డవరప్పాడు

● **సమస్య:** పది రోజుల వయసున్న గేదె దూడ పారుడుతో నీరసంగా ఉంటోంది. ఏం చేయాలి? – ముప్పు ఉంద్రయ్య, వెల్లంపల్లి

సమాధానం: దూడ శరీర బరువుకు పది శాతం గిన్నెల్లో పాలు తాగిస్తే.. రోగ నిరోధక శక్తి పెరిగి ఈ తరహా సమస్యలు తలెత్తవు. మట్టి తినకుండా జాగ్రత్త వహించాలి. నెల రోజుల వయసులో డీవార్మింగ్ మందులు వాడాలి. – న్యూస్‌టుడే, మద్దిపాడు

రైతేరాజు

చింత, పనస తోటల సాగుకు ప్రోత్సాహం

ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించే క్రమంలో ఈ ఏడాది కొత్తగా పనస, చింత తోటల సాగుకు ప్రభుత్వం రాయితీలు అందిస్తున్నట్లు కంభం ఉద్యాన శాఖ అధికారిణి శ్వేత తెలిపారు. హెక్టారుకు తొలి ఏడాది రూ.18 వేలు; తరువాత రెండేళ్ల పాటు ఏడాదికి రూ.ఆరు వేలు చొప్పున మొత్తంగా రూ.30 వేల సాయం అందిస్తారని చెప్పారు. జిల్లాలోని నేలలు ఈ సాగుకు అనుకూలమని... ఆసక్తి గల రైతులు ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.



మీ కోసం

▶ **పనస...** హెక్టారుకు వంద మొక్కలు నాటవచ్చు. రెండేళ్ల నుంచే కాపు ఆరంభమవుతుంది. సస్యరక్షణ చర్యలను బట్టి 30 నుంచి 60 ఏళ్ల వరకు దిగుబడి తీయవచ్చు. తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాల్లోనూ సాగు చేయవచ్చు. ఈ పండ్లతో పాటు ఆకులు, కొమ్మలు, కలపకు విలువ ఉంది. పురుగు, తెగుళ్ల సమస్యలు పెద్దగా ఉండవు. ఇతర పండ్ల తోటలతో పోలిస్తే ఆర్థికంగా లాభదాయకంగా ఉంటుంది. విటమిన్ ఎ, బి, సి, పొటాషియం, కాల్షియం, ఐరన్, ప్రోటీన్లు సమృద్ధిగా ఉండే పండు ఇది.

▶ **చింత...** తక్కువ వర్షపాతం ఉన్న కరవు నేలల్లోనూ సాగు చేయవచ్చు. హెక్టారు వంద మొక్కలు నాటవచ్చు. నాలుగేళ్ల నుంచి దిగుబడి ప్రారంభమవుతుంది. తొమ్మిదేళ్ల నుంచి పూర్తిస్థాయిలో ఫలసాయం అందిస్తుంది. యాభై ఏళ్ల వరకు మంచి దిగుబడి ఉంటుంది. రాళ్లు, మెట్ట భూముల్లోనూ సాగు చేయవచ్చు.

– న్యూస్‌టుడే, బేస్తవారపేట గ్రామీణం

రైతులకు కూలీల కొరత గుదిబండలా మారింది. సమయానికి ఎవరూ దొరక్క... ఇతర ప్రాంతాల నుంచి రప్పించాల్సి వస్తోంది. ఇందుకోసం అధిక మొత్తం వెచ్చించాల్సి వస్తోంది. ఒక్కోసారి వారు దొరక్క పంట నష్టం చవిచూడాల్సి వస్తోంది. యంత్రపరికరాల వినియోగంతో ఈ సమస్యను అధిగమించవచ్చని జిల్లా ఉద్యాన శాఖ అధికారి గోపీచంద్ తెలిపారు. ప్రభుత్వం రాయితీపై వాటిని అందిస్తోందని... కర్షకులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. –న్యూస్‌టుడే, కంభం

యంత్రం... కూలీల కొరతకు పరిష్కారం

▶ **మినీ ట్రాక్టర్...** అయిదెకరాల్లోపు పొలం ఉన్న వారికి రూ.లక్ష; అంతకంటే ఎక్కువ భూమి ఉన్న వారికి రూ.75 వేల రాయితీపై ఇస్తున్నారు. 20 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన ట్రాక్టర్లు జిల్లాకు 50 మంజూరు చేశారు.

▶ **బిందు సేద్యం పరికరాలు...** అయిదెకరాల్లోపు భూమి ఉన్న రైతులకు 90 శాతం రాయితీపై అందిస్తున్నారు.

▶ **తుంపర సేద్యం పరికరాలు...** అయిదెకరాల్లోపు కర్షకులకు 55 శాతం; 5 నుంచి 12 ఎకరాల్లోపు ఉంటే 45 శాతం రాయితీపై ఇస్తున్నారు.

▶ బత్తాయిలో కొమ్మ కత్తిరింపు, బోర్డో పేస్టు పూయడం, పాదుల ఏర్పాటు, ఎండుపుల్ల కత్తిరింపునకు హెక్టారుకు రూ.17,380 చొప్పున అందిస్తున్నారు. జిల్లాలో 60 హెక్టార్లకు అనుమతులు ఇచ్చారు. ఎనిమిదేళ్లకు పైగా వయసు ఉన్న తోటలకు మాత్రమే ఇది వర్తిస్తుంది.



మినీ ట్రాక్టర్



ట్రాక్టర్ మౌంటెడ్ స్ప్రేయర్

పరికరం	సామర్థ్యం	మంజూరైన యూనిట్లు	రాయితీ (రూ.ల్లో)
పవర్ టిల్లర్	8 బీహెచ్‌పీ కంటే తక్కువ	5	40 వేలు
పవర్ టిల్లర్	8 బీహెచ్‌పీ కంటే ఎక్కువ	5	60 వేలు
ట్రాక్టర్ మౌంటెడ్ స్ప్రేయర్లు	20 బీహెచ్‌పీ కంటే తక్కువ	3	8 వేలు
ట్రాక్టర్ మౌంటెడ్ స్ప్రేయర్లు	35 బీహెచ్‌పీ కంటే ఎక్కువ	5	50 వేలు
డ్రైవాన్ స్ప్రేయర్లు	16 లీటర్లు	280	10 వేలు
మల్చింగ్ షీట్ పరిచే యంత్రం	-	4	28 వేలు
మొక్క, విత్తనం నాటే పరికరాలు	-	2	12 వేలు

బదిలీల అక్రమాలపై విచారణ

ఈనాడు కథనానికి స్పందన

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామ సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియకు సంబంధించి 'ఈనాడు'లో ఆదివారం 'నగదు ఇవ్వు.. లేఖ తీసుకెళ్లు' శీర్షికన ప్రచురితమైన కథనంపై కలెక్టర్ తమీమ్ అన్సారియా విచారణకు ఆదేశించారు. ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారి లోకేశ్వరరావు స్థానిక కలెక్టరేట్‌లోని డీపీవో కార్యాలయంలో సోమవారం విచారించారు. డీపీవో ఉషారాణి, పూర్వ ఏవో శివప్రసాద్, కార్యాలయ ఉద్యోగి కిషోర్‌తోపాటు, పూర్వ ఉద్యోగి సాయిను విచారించి వారి వద్ద నుంచి స్టేట్‌మెంట్ నమోదు చేసినట్లు సమాచారం. గ్రేడ్-5, గ్రేడ్-6 కార్యదర్శుల బదిలీల్లో నెలకొన్న జాప్యం, వారి నుంచి నగదు వసూళ్లు, అందులో ఎవరి పాత్ర ఉందన్న తదితర అంశాలపై ఆరా తీశారు.

జాతీయస్థాయి దివ్యాంగ క్రికెట్ పోటీలకు ఎంపిక

దర్శి, న్యూస్‌టుడే: దర్శి క్రిస్టియన్‌పాలేనికి చెందిన వేల్పుల విజయకుమార్ జాతీయ స్థాయి దివ్యాంగ టి-20 క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన ఆయన పోలియో కారణంగా వైకల్యం ఉంది. ప్రస్తుతం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో ఒప్పంద విధానంలో మేల్ స్టాఫ్ నర్సుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. సెప్టెంబర్ 15-17 తేదీల్లో ఒంగోలులో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 15 నుంచి 25 వరకు రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో జరిగే జాతీయస్థాయి టి-20 పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున ఆడనున్నట్లు విజయకుమార్ వివరించారు. గతంలో చైనాలో జరిగిన పారా ఒలంపిక్ పోటీల్లో బీచ్ వాలీబాల్‌లోనూ తలపడినట్లు ఆయన తెలిపారు.



విజయకుమార్

వేతనాలు చెల్లించాలని సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ జిల్లా సమగ్ర శిక్షా ఉద్యోగులు స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. జిల్లా జేఏసీ కార్యనిర్వాహక కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో 22 రోజులపాటు ఉద్యోగుల సమస్యలపై ధర్నా చేసినప్పటికీ ఆ సమయంలో ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కష్టాలు తీరతాయి అనుకుంటే రెండు నెలలగా జీతాలు విడుదల చేయలేని పరిస్థితి నెలకొందని వివరించారు. సకాలంలో జీతాలు ఇవ్వకుంటే పండగ పూట పస్తులుండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సింగయ్య, మాధవాచారి, వినయ్, శ్రీదేవి, కవిత తదితరులు పాల్గొన్నారు.

వంద బస్తాల చౌక బియ్యం పట్టివేత

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి శివారు హరిహర క్షేత్రం వద్ద విజిలెన్స్ బృందం నిర్వహించిన తనిఖీల్లో సంతనూతలపాడు వైపు తరలిస్తున్న 100 బస్తాల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత లారీలో బియ్యం తీసుకెళ్తుండగా పట్టుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. చీమకుర్తిలోని పలు చౌక దుకాణాల నుంచి సంతనూతలపాడుకు ఈ బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం. బియ్యాన్ని ఎంఎల్ఎస్ గోదాంకు తరలించి వాహనాన్ని సీజ్ చేశారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేజీబీవీల్లో బోధనేతర సిబ్బంది భర్తీకి దరఖాస్తులు


ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న 52 బోధనేతర సిబ్బంది పోస్టులను భర్తీ చేయడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఈవో డి.సుభద్ర సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో 2024-25 విద్యా సంవత్సర కాలానికి విధుల్లోకి తీసుకుంటారన్నారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు సోమవారం నుంచి ఈ నెల 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నేరుగా డీఈవో కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వాలన్నారు. జిల్లా వ్యాప్తంగా టైప్-3 కేజీబీవీల్లో హెడ్‌కుక్ ఏడు, అసిస్టెంట్ కుక్ 18, నైట్‌వాచ్ ఉమెన్ ఆరు, స్కావెంజర్ అయిదు, స్వీపర్ ఆరు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. టైప్-4 కేజీబీవీల్లో పది పోస్టులకు గాను హెడ్‌కుక్ మూడు, అసిస్టెంట్ కుక్ మూడు, చౌకీదార్ నాలుగు పోస్టులు భర్తీ చేస్తారని తెలిపారు. ఈ నెల 18న జిల్లా స్థాయిలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల జాబితా తయారీ అనంతరం 21న ఆమోదం కోసం జిల్లాస్థాయి ఎంపిక కమిటీకి సమర్పిస్తారన్నారు. రాష్ట్ర కార్యాలయంలో ఎంపిక జరుగుతుందన్నారు. జులై ఒకటి 2024 నాటికి ఓసీలు అయితే 42 సంవత్సరాలు, మాజీ సైనికోద్యోగులు 45 సంవత్సరాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీకి 47 సంవత్సరాలు, పీహెచ్‌సీ అభ్యర్థులకు 52 సంవత్సరాలు సడలింపు ఉందన్నారు. వాచ్‌ఉమెన్ పోస్టుకు మాత్రం ఏడోతరగతి విద్యార్హత ఉండాలన్నారు.

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచిత డీఎస్సీ శిక్షణ

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు సంయుక్తంగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానంలో ఉచిత డీఎస్సీ శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి ఎన్.లక్ష్మానాయక్ తెలిపారు. ఎంపిక చేసిన శిక్షణ సంస్థలు, సంక్షేమ శాఖలు నిర్వహిస్తున్న స్టడీ సర్కిల్‌లో తర్ఫీదు ఇస్తారన్నారు. దరఖాస్తు చేసుకునే శిక్షణ సంస్థలు కనీసం రెండు డీఎస్సీ రిక్రూట్‌మెంట్లకు కోచింగ్ ఇచ్చి ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న సంస్థలు ఈ నెల 21 లోపు దరఖాస్తు చేసుకోవాలని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

అద్దె ఎగనామం.. సచివాలయానికి తాళం

పెద్దారవీడు, న్యూస్‌టుడే: అద్దె చెల్లించకపోవడంతో విసిగిపోయిన ఇంటి యజమాని గ్రామ సచివాలయానికి తాళం వేసిన సంఘటన మండలంలోని తోకపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. స్థానిక మేకల సీతమ్మ ఇంటిని నెలకు రూ.2500 చొప్పున సచివాలయానికి అద్దెకు తీసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో నాలుగేళ్ల కాలానికి అద్దె చెల్లించలేదు. అధికారులను మొరపెట్టుకుంటే...ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రూ.లక్ష బకాయిలు ఉన్నాయని వాటిని చెల్లించాలని అడిగితే అధికారులు సమాధానం దాటవేస్తున్నారని.. ఆవేదనతో సిబ్బందిని బయటకు పంపించి గదికి తాళం వేశానని ఆమె తెలిపారు. దీంతో సచివాలయ సిబ్బంది గ్రామ సమీపంలోని రైతు భరోసా కేంద్రంలో సాయంత్రం వరకూ ఉన్నారు. ఈ విషయంపై ఇన్‌ఛార్జి ఎంపీడీవో శ్రీనివాసరెడ్డిని వివరణ కోరగా..ఇంతకాలం ఎందుకు అద్దె చెల్లించలేదో సిబ్బందిని విచారిస్తామని తెలిపారు.



తాళం వేసిన తోకపల్లి గ్రామ సచివాలయం



ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన

ఆదివాసీ ప్రాంతాల్లో దాడులు ఆపాలంటూ ధర్నా

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్ దండ కారణ్య ప్రాంతాల్లో జనవరి ఒకటో తేదీ నుంచి కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న డ్రోన్, వైమానిక దాడులను తక్షణమే ఆపేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదిక రాష్ట్ర కన్వీనర్ చిలుక చంద్రశేఖర్ మాట్లాడుతూ.. రోజుకి పదుల సంఖ్యలో ఆదివాసీలు, మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అడవుల్లోని ఖనిజ సంపదను దోచుకునే కార్పొరేట్ కంపెనీలతో మైనింగ్ ఒప్పందాలను అమలు చేయడానికి కేంద్రం అటవీ చట్టాలను సవరించినట్లు ఆరోపించారు. కార్పొరేటర్లకు అనుకూలమైన ఆపరేషన్ కగార్‌ను రద్దు చేయడంతోపాటు, ఇప్పటి వరకు జరిగిన ఆదివాసీల హత్యాకాండపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అక్కడ ఉన్న మిలిటరీ శిబిరాలను ఎత్తివేయడంతోపాటు, అటవీ చట్టాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు చావలి సుధాకర్, ఎం.ఎల్.నారాయణ, మోహన్, యు.వెంకటేశ్వర్లు, జి.కల్యాణరావు, మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పీఎఫ్ సమస్య పరిష్కరించాలని వినతి

ఒంగోలు గ్రామీణం: ఉపాధ్యాయ, ఉద్యోగుల జడ్పీ పీఎఫ్ క్లోజర్స్, రుణాలు, స్లిప్పుల జారీ చేయడం తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం జడ్పీ సీఈవో చిరంజీవికి వినతిపత్రం అందజేశారు. 2023-24 పీఎఫ్ స్లిప్పులు ఇంకా ఇవ్వని ఉన్నత పాఠశాలలు, మండలాలకు వెంటనే ఇవ్వాలని కోరారు. స్లిప్పులు ఆన్‌లైన్ చేయడంతోపాటు, పీఎఫ్ క్లోజర్స్, రుణాలను సీఎఫ్ఎంఎస్‌కు అప్‌లోడ్ చేయాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సంఘం నాయకులు వి.జనార్దన్‌రెడ్డి, డి.శ్రీనివాసులు, బి.శేషారావు, కె.రవి, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే మినీ లారీలో నగదు చోరీ

దర్శి, న్యూస్‌టుడే: జీవాలను అమ్ముకుని మినీ లారీలో తీసుకెళుతున్న నగదు చోరీకి గురైన సంఘటన సోమవారం మధ్యాహ్నం దర్శిలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు.. పీసీపల్లి మండలం వేపగుంపల్లి, మరో గ్రామానికి చెందిన దుర్గం రామకృష్ణ, మరో అయిదుగురు రైతులు మినీ లారీలో గొర్రెలను పల్నాడు జిల్లా వినుకొండ సంతకు తీసుకెళ్లారు. 53 గొర్రెలను అమ్మగా వచ్చిన రూ.4.57 లక్షల నగదును మినీ లారీలోని డ్యాష్ బోర్డులో పెట్టి తాళం వేశారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో దర్శి-పొదిలి రోడ్డులోని డీఎస్పీ కార్యాలయానికి అతి సమీపంలో వాహనం నిలిపి భోజనానికి వెళ్లారు. ముగ్గురు భోజనానికి వెళ్లగా, మరో ముగ్గురు కొంత దూరం ముందుకెళ్లి తిరిగి వచ్చి చూడగా లారీ సైడు డోర్ అద్దం, డ్యాష్ బోర్డు పగులగొట్టి ఉన్నాయి. నగదు కనిపించలేదు. దీంతో వెంటనే బాధిత రైతులు విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. సీఐ రామారావు, ఎస్సై మురళి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సమీపంలోని సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను పరిశీలించారు. ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి నగదును దోచుకెళ్లినట్లు సీసీ ఫుటేజీలో నమోదైంది. వారి ఆచూకీ కోసం అన్ని మార్గాల్లో గాలిస్తున్నారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



నగదు దొంగతనం చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్న వ్యక్తులు (సీసీ కెమెరాలో నమోదైన దృశ్యం)

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 123, రిటైల్ లైవ్ - 145, చికెన్ విత్ స్కిన్ - 210, చికెన్ స్కిన్‌లెస్- 239

మార్కాపురం
•మార్కాపురం • గిద్దలూరు • యర్రగొండపాలెం

వరద బాధితులకు ఆర్థిక సాయం

త్రిపురాంతకం, త్రిపురాంతకం గ్రామీణం : విజయవాడ వరద బాధితుల సహాయార్థం త్రిపురాంతకం మండలంలోని పలు గ్రామాల నుంచి తెదేపా ఆధ్వర్యంలో విరాళాలు అందించారు. వసూలైన రూ.3,03,700లను మండల తెదేపా కన్వీనర్ మేకల వలరాజు వైపాలెం నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబుకు నగదు చెక్కును అందించారు.


ఎరిక్షన్‌బాబుకు నగదును అందిస్తున్న వలరాజు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

మార్కాపురం: ఉమ్మడి ప్రకాశం జిల్లా సబ్ జూనియర్ బాలబాలికల బాస్కెట్ బాల్ జట్లకు కందుకూరులో ఈనెల 5వ తేదీ జరిగిన పోటీల్లో రాయవరంలోని గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఎస్.సునిత తెలిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థులైన టి.గాయత్రి, యు.దివ్యలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 10-12 వ తేదీల్లో జరిగే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.


ఎంపికైన విద్యార్థులతో రాయవరం గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు

అన్నపూర్ణా.. నమోస్తుతే


గిద్దలూరులో ప్రత్యేక అలంకరణలో

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఐదవ రోజు సోమవారం మార్కాపురం పట్టణంలో అమ్మవారు మహాలక్ష్మీగా, గజలక్ష్మీగా భక్తులను కనువిందు చేశారు. బేస్తవారపేటలో అమ్మవారు శ్రీ గజలక్ష్మీదేవిగా, సోమవారపేటలో చండీదేవిగా, పుల్లలచెరువులో అన్నపూర్ణాదేవిగా, కొమరోలులో గాయత్రి దేవీగా, గిద్దలూరులో మీనాక్షీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా కొమరోలులోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో హనుమంత వాహనంపై దేవేరులను ఊరేగించారు.

\- న్యూస్‌టుడే బృందం


పుల్లలచెరువులో అన్నపూర్ణాదేవిగా


కొమరోలులో గాయత్రీ దేవిగా





మార్కాపురం పట్టణం, బేస్తవారపేట, కంభంలో గజలక్ష్మీగా..

పశ్చిమంలో భూదందా..!

▸ ఫ్రీ హోల్డ్ మాటున భారీగా అక్రమాలు

- మార్కాపురం మండలం లోని మొద్దులపల్లెలో చనిపోయిన చప్పిడి కొండయ్యకు చెందిన భూమిని మరొకరికి అదే పేరుతో ఫ్రీ హోల్డ్ కింద భూమిని విక్రయం చేసి రిజిస్ట్రేషన్ చేసినట్లు దొంగ పత్రాలను సృష్టించి కొట్టేశారు.
- తర్లుపాడు మండలంలోని బుడ్డపల్లిలో 90 మంది అర్హత లేకపోయినా పశువులమేత బీడు భూములు, చెరువులు, వాగులను అక్రమంగా ఆన్‌లైన్ చేసుకున్నారు.
- కొనకనమిట్ల మండలం లోని తువ్వపాడులో కల్లం కోటేశ్వర రావుకు 1.25 ఎకరాల అసైన్‌మెంట్ భూమి ఉంది. ఈ భూమిని తనకు తెలియ కుండా మరొకరు ఫ్రీ హోల్డ్ కింద అక్రమంగా చేసుకున్నారని బాధితుడు ఆరోపిస్తున్నారు.



మార్కాపురం, న్యూస్‌టుడే

వైకాపా ప్రభుత్వ హయాంలో రెవెన్యూలో జరిగిన అక్రమాలు అన్నీ ఇన్నీకావు. కొందరు రెవెన్యూ అధికారులు, వైకాపా నాయకులు కుమ్మక్కై భారీ స్థాయిలో అక్రమాలకు పాల్పడ్డారు. ఏకంగా వాగులు, పశువుల మేత బీడు భూములను సైతం ఆన్‌లైన్ చేసుకుంటున్నారు. ఫ్రీ హోల్డ్ పేరు చెప్పి భూములను పంచేసుకున్నారు. 20 ఏళ్ల దాటిన కిందట అంటే 2003కు ముందు పేదలకు పంపిణీ చేసిన భూములకు యాజమాన్య హక్కులు (ఫ్రీ హోల్డ్) కల్పిస్తూ గత ప్రభుత్వం జీవో జారీ చేసింది. దాని మాటున నిబంధనలకు విరుద్ధంగా వేల ఎకరాలకు హక్కులు కట్టబెట్టారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూచనల మేరకు అధికారులు బృందాలుగా ఏర్పడి గత పది రోజులుగా విచారణ చేస్తున్నారు. ఈ విచారణలో అధికారులకు అక్రమాలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి.

మండలం	ఫ్రీ హోల్డ్‌లో ఉన్న భూమి (ఎకరాలు)
అర్ధవీడు	272.42
బేస్తవారపేట	4,381.45
కంభం	1,043.16
దోర్నాల	4,054.22
గిద్దలూరు	4,557.81
కొమరోలు	1,047.48
మార్కాపురం	3,501.18
పెద్దారవీడు	4,674.91
పుల్లలచెరువు	9,398.58
రాచర్ల	2,001.21
తర్లుపాడు	5,227.81
త్రిపురాంతకం	4,502.17
యర్రగొండపాలెం	2,646.74
మొత్తం	47,309.14

మార్కాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 47,309.14 ఎకరాలను ఫ్రీ హోల్డ్ చేశారు. దీంతో అప్పటి అధికారులు, వైకాపా నాయకులు కలిసిపోయి అక్రమాలకు తెరలేపారు. 2003కు ముందువి చేయాలని నిబంధనలు ఉన్నా నాయకుల మాటలు విని అధికారులు వారికి ఇష్టం వచ్చినట్లు 2003 తర్వాతవి కూడా చేశారు. 2012-2023 కూడా మధ్యలో ఉన్న భూములను కూడా చేశారని పలు గ్రామాలకు చెందిన ప్రజలు, లబ్ధిదారులు ఆందోళన బాటపట్టారు. ఇప్పటికీ తహసీల్దారు, ఉప కలెక్టర్ కార్యాలయాల ఎదుట బాధితులు ఆందోళన చేస్తున్నారు. దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఫ్రీ హోల్డ్ భూములపై దృష్టి సారించి ప్రస్తుతానికి మొత్తం రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేయాలని, ఫ్రీ హోల్డ్ కింద ఉన్నవి ఆన్‌లైన్ చేయడం, రిజిస్ట్రేషన్లు చేయడం నిలుపుదల చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.


బుడ్డపల్లె గ్రామంలో ఫ్రీ హోల్డ్ పేరుతో భూ అక్రమాలకు పాల్పడ్డారని ధర్నా చేస్తున్న గ్రామస్థులు

విచారణ చేస్తున్నాం



డివిజన్ పరిధిలో తొమ్మిది బృందాలు విచారణలు చేపట్టాయి. ఈ నెల 9వ తేదీ నాటికి విచారణ పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించాం. ఫ్రీ హోల్డ్ కింద అక్రమాలు చోటు చేసుకున్నట్లు విచారణలో తేలితే అధికారుల సూచనల మేరకు చర్యలు తీసుకుంటాం.

\- సహదిత్ వెంకట త్రివినాగ్, ఉప కలెక్టర్, మార్కాపురం

అన్న క్యాంటీన్‌కు విరాళం అందజేత

గిద్దలూరు పట్టణం: పేదలకు ప్రభుత్వం రూ.5కే భోజనం అందజేస్తున్న అన్న క్యాంటీన్ నిర్వహణ కోసం గిద్దలూరుకు చెందిన ఫాతీమా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు నంద్యాల ఖాసీంవలి సోమవారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి రూ.25వేల చెక్కును అందజేశారు. ఎన్.బైనపల్లె గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయులు అన్న క్యాంటిన్‌కు రూ.8వేల చెక్కును ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి అందించారు.

ఘనంగా మేరీమాత జన్మదిన వేడుకలు

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని రైల్వేస్టేషన్ వెళ్లే దారిలోని ఆర్సీఎం చర్చిలో సోమవారం మేరీమాత జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న నెల్లూరు మేత్రాసనం ఫాదర్ మనీ సందేశం ఇచ్చారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం మేరీమాతను అలకరించి పట్టణ వీధుల్లో ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఫీటర్‌ఫిలో, అఖిల, శిరీష, హర్మోనిస్ట్ రవి పాటలు పాడి అలరించారు.


మేరీమాతను ఊరేగిస్తున్న దృశ్యం

శిథిలావస్థలో పశువైద్యశాల భవనం

కంభం, న్యూస్‌టుడే : మండలంలోని తురిమెళ్ల పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరుతోంది. తలుపులు, కిటికీలు, చెదలు పట్టి పాడైపోయాయి. నిత్యం పదుల సంఖ్యలో గేదెలు, జీవాలను వాటి యజమానులు చికిత్స కోసం తీసుకువస్తుంటారు. దానికి ప్రహరీ లేకపోవడంతో విష పురుగులు భవనంలోకి వస్తున్నాయని సిబ్బంది చెబుతున్నారు. ప్రహరీ ఏర్పాటు చేయాలని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. కార్యాలయంలోని విలువైన వస్తువులు, మందులు, దస్త్రాలు పాడైపోతున్నాయి. ద్వారబంధనాలు, కిటికీలు, విద్యుత్తు బోర్డులు దెబ్బతిన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రహరీ ఏర్పాటు చేయాలని, భవనానికి మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు. మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపించినట్లు ఏడీ బాలునాయక్ తెలిపారు.


ప్రహరీ లేని తురిమెళ్ల పశువైద్యశాల

బాధ్యతల స్వీకరణ

గిద్దలూరు పట్టణం : గిద్దలూరు సబ్ రిజిస్ట్రర్‌గా సోమవారం ఎన్.కృష్ణమోహన్‌రావు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని ఆయన నివాసగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు.


ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కృష్ణమోహనరావు

▸ కొమరోలు గ్రామీణం : కొమరోలు పంచాయతీ కార్యదర్శిగా డి.బ్రహ్మయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. కంభం పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

ఏళ్లుగా మారని తీరు

కంభం, న్యూస్‌టుడే : మండలంలోని కంభం-గిద్దలూరు ప్రధాన రోడ్డు నుంచి జేబీకే పురం గ్రామంలోకి వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. దాన్ని సుమారు ఆరేళ్ల కిందట కొంత దూరం తారు రోడ్డు వేశారు. మరికొంత దూరం కంకర పరిచి వదిలేశారు. కంకర పరిచిన ప్రాంతం గుంతలు ఏర్పడ్డాయి. దాని పైనుంచి రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఆగిపోయిన నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నారు. రహదారిని పరిశీలించి బాగు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని పంచాయతీరాజ్ డీఈ సుబ్బారెడ్డి తెలిపారు.


కంకర పరిచి గుంతలతో ఉన్న రహదారి


మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం: 8008574135
యర్రగొండపాలెం : 8008552658
కంభం : 8008632343
పొదిలి : 8008550360

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే:

సమస్య : పట్టణం నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో చెరువు కట్టపై వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. చర్యలు తీసుకోవాలి

–ఎన్.నరిసింహచారి, పట్టణవాసి



సమాధానం: సిబ్బందిని పంపించి లైట్లు వెలిగేలా చర్యలు తీసుకుంటాం.

– డీవీఎస్.నారాయణరావు, మున్సిపల్ కమిషనర్

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే

సమస్య : గిద్దలూరు మండలం కృష్ణంశెట్టిపల్లె బీసీకాలనీలో కాలువలు లేకపోవడంతో వర్షాకాలంలో మురుగు నీరు గృహాల ముందు చేరి దుర్వాసన వేస్తోంది. రాత్రి వేళ దోమల బెడద అధికంగా ఉంటోంది. చర్యలు తీసుకోండి.

– చంద్రశేఖర్, కృష్ణంశెట్టిపల్లె

సమాధానం : ఇటీవలే కృష్ణంశెట్టిపల్లె బీసీ కాలనీలో కాలువలు, సిమెంట్ రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేశాం. అనుమతి వచ్చిన వెంటనే పనులు చేపడతాం.

– రాఘవరావు, పంచాయతీ కార్యదర్శి, కృష్ణంశెట్టిపల్లె

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురంలో ఉన్న బాణసంచా దుకాణాలు తప్పనిసరిగా అన్ని నిబంధనలు పాటించాలని.. ఎటువంటి అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీఎస్పీ యు.నాగరాజు ఆదేశించారు. సోమవారం మార్కాపురం పట్టణంలోని అనుమతి ఉన్న హోల్‌సేల్ దుకాణాలను పోలీసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పట్టణంలోని బొంతల శ్రావణ్‌కుమార్, వేముల కేశవరావులకు చెందిన దుకాణాలను పరిశీలించారు. తనిఖీ సందర్భంగా గోడౌన్లను పరిశీలించి పలు సూచనలు చేసినట్లు తెలిపారు. అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవైనా ప్రమాదాలు జరిగితే యజమానులే బాధ్యత అన్నారు. అనంతరం మార్కాపురం గ్రామీణ పోలీసు స్టేషన్‌కు చేరుకొని రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను తక్షణమే పరిష్కరించాలన్నారు. త్వరగతిన కేసుల్లో పురోగతి సాధించాలన్నారు. దొంగతనం జరిగిన కేసులను వెంటనే ఛేదించి రికవరి చేయాలన్నారు. రౌడీషీటర్లపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఐ సుబ్బారావు, మార్కాపురం గ్రామీణ ఎస్సై అంకమరావు, సిబ్బంది పాల్గొన్నారు.

▸ పొదిలి గ్రామీణం, న్యూస్‌టుడే: సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని పొదిలి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అనుమానిత చరవాణి కాల్స్‌లో ఎవరినీ నమ్మవద్దన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పలు ప్రభుత్వ శాఖల నుంచి మాట్లాడుతున్నామని బెదిరింపులకు పాల్పడితే ఎటువంటి భయాందోళన చెందకుండా పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వేమన, సిబ్బంది పాల్గొన్నారు.


మార్కాపురంలోని బాణసంచా దుకాణాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ నాగరాజు

కారు బోల్తా.. దంపతులకు గాయాలు

కనిగిరి, న్యూస్‌టుడే: కారు బోల్తా పడి దంపతులకు గాయాలైన సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని మాచవరం జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. వివరాల్లోకెళితే.. పొదిలిలోని కొత్తూరుకు చెందిన చక్కా అశోక్ నేవి ఉద్యోగి, తన భార్య భార్గవి, మూడేళ్ల కుమారుడు అశ్విన్ ఉదయం కడప జిల్లా పొద్దుటూరుకు సొంత కారులో బయలుదేరారు. మాచవరం వద్దకు వచ్చే సరికి రోడ్డుపై గుంత కనిపించడంతో ఒక్కసారిగా బ్రేక్ వేయగా.. బోల్తా పడింది. ఈ ఘటనలో అశోక్‌కు స్వల్ప గాయాలుకాగా, భార్గవికి కాలు విరిగింది. సమాచారం అందుకున్న సీఐ షేక్ ఖాజావలి, ఎస్సై టి.శ్రీరామ్‌లు అక్కడికి చేరుకుని కారులో ఇరుక్కు పోయి పెద్దగా కేకలు వేస్తున్న భార్యాభర్తలు, బాలుడిని బయటకు తీశారు. 108 వాహనం ద్వారా ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.


కారులో ఇరుక్కు పోయిన వారిని బయటకు తీస్తున్న పోలీసులు

టిప్పర్‌ను ఢీకొన్న వాహనాలు

బేస్తవారపేట, న్యూస్‌టుడే : టిప్పర్ లారీని వాహనాలు వెనుక వైపు ఢీ కొన్న ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన మండలంలోని సోమవారం చోటుచేసుకుంది. చీమకుర్తి నుంచి గిద్దలూరుకు కంకర లోడుతో వెళ్తున్న టిప్పర్ పూసలపాడు సమీపం వద్దకు రాగానే విజయవాడ నుంచి మదనపల్లి వెళ్తున్న మినీ లారీ అదుపుతప్పి వెనుక వైపు ఢీ కొట్టింది. దీంతో మినీ లారీ ముందుభాగం పూర్తిగా దెబ్బతినడంతో చోదకుడు గంగాధర్ వాహన క్యాబిన్‌లో ఇరుక్కుపోయి గాయాలపాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. టిప్పర్‌ను రహదారి పక్కన నిలుపగా మరో గంట వ్యవధిలోనే అదే టిప్పర్‌ను పత్తికొండ నుంచి తెనాలికి టమోటా లోడుతో వెళ్తున్న బొలేరో వాహనం అదుపుతప్పి వెనుక వైపు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు.

నిమ్మతోటల పరిశీలన


తోటలను పరిశీలించి సూచనలిస్తున్న శాస్త్రవేత్త రవీంద్రబాబు

పొదిలి గ్రామీణం, న్యూస్‌టుడే : నిమ్మ చెట్లకు ఎండు కొమ్మలను తొలగించుకోవాలని దర్శి కృషి విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రబాబు అన్నారు. సోమవారం ఆయన పొదిలి మండలం కంభాలపాడులో పర్యటించి నిమ్మతోటలను పరిశీలించారు. నిమ్మతోటల పునరుద్ధరణపై రైతులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖాధికారిణి ప్రత్యూష, వ్యవసాయాధికారి జైనుల్లాబ్దీన్, ఉద్యాన విస్తరణాధికారి ధనలక్ష్మి గ్రామ వ్యవసాయ సహాయకులు సునీత పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తీర్చాలని రాస్తారోకో

యర్రగొండపాలెం, న్యూస్‌టుడే : నెలరోజులుగా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు సోమవారం జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. పట్టణంలోని వేగినాటి కోటయ్య కాలనీలో పంచాయతీ బోర్లు ఒట్టిపోవడం, రాజకీయ కారణాలతో ట్యాంకర్లు నిలిపేయడంతో జనాలు తీవ్ర నీటి కొరత ఎదుర్కొంటున్నారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకపోవడంతో జాతీయ రహదారి-565పై రాస్తారోకో చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడడంతో పోలీసులు, పంచాయతీ అధికారులు వచ్చి వారికి సర్దిచెప్పారు. నీటి ట్యాంకర్లు ఏర్పాటుచేస్తామనే హామీతో నిరసన విరమించారు.


జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న కాలనీవాసులు

వృద్ధుడి ప్రాణం తీసిన పొరపాటు

కంభం (రాచర్ల): పొరపాటున గొర్రెలకు పేలు చంపే మందు తాగి వృద్ధుడు మృతి చెందిన సంఘటన రాచర్ల మండలం ఆకవీడులో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బండి వెంకటయ్య (80) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆరోగ్యం కోసం టానిక్ తాగుతుంటారు. కుటుంబ సభ్యులు గొర్రెలకు పేలు పడటంతో నివారించేందుకు మందులు తెచ్చి పెట్టారు. వెంకటయ్య తీసుకునే టానిక్, పేలు చంపే మందులు ఒకే చోట పెట్టారు. చూపు సరిగా లేని వెంకటయ్య పేలు చంపే మందును శనివారం పొరపాటున తాగడంతో అస్వస్థతకు గురయ్యాడు. మొదటి గిద్దలూరు, నంద్యాలలో చికిత్స చేయించి కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

కంభం చెరువు అభివృద్ధికి వినతి

కంభం, న్యూస్‌టుడే : కంభం చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ హామీ ఇచ్చినట్లు కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాల బలిజ సేవా సంఘం నాయకులు తెలిపారు. రాజమండ్రిలోని మంత్రి నివాసంలో సోమవారం ఆయన్ను వారు కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరినట్లు చెప్పారు.


మంత్రి కందుల దుర్గేష్‌కు వినతి పత్రం అందజేస్తున్న బలిజ సంఘం నాయకులు

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న ఆహారాన్ని క్రమం తప్పకుండా తీసుకుంటే పౌష్టికాహార లోపాన్ని అధిగమించవచ్చని సీడీపీవో పద్మావతి అన్నారు. నల్లమలలోని ఇష్టకామేశ్వరీ అమ్మవారి ఆలయం వద్ద గిరిజనులకు పౌష్టికాహార ప్రాముఖ్యతను వివరించి గర్భిణులకు సీమంతాలు చేశారు.


గర్భిణులకు సీమంతాలు చేస్తున్న సీడీపీవో

పరిశుభ్రత.. కమిటీదే బాధ్యత

- ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయింపు
- పాఠశాలలో మెరుగుపడనున్న పారిశుద్ధ్యం

బేస్తవారపేట, న్యూస్‌టుడే:

పాఠశాలల రూపురేఖలు మార్చడానికి కూటమి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ)లను వీటి అభివృద్ధిలో భాగస్వాములను చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఉపాధ్యాయులపై బోధనేతర పనిభారం తగ్గించి వారిని అధిక సమయం విద్యార్థులకు పాఠ్యాంశాలు నేర్పించేలా చూసేందుకు చంద్రబాబు ప్రభుత్వం కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది.

సభ్యులకు ఐడీ పాస్‌వర్డ్‌లు..

గత వైకాపా ప్రభుత్వం పాఠశాలల యాజమాన్య కమిటీలను రద్దు చేసి, తల్లిదండ్రుల పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేసింది. ఇందులోని సభ్యులను కేవలం ఉత్సవ విగ్రహాలను చేసింది. నెలకు ఒకసారి నిర్వహించే సమావేశాలకు రావడం, సంతకాలు చేసి వెళ్లడానికే వారు పరిమితమయ్యారు. తాజాగా ప్రభుత్వం పాఠశాల యాజమాన్య కమిటీలను పునరుద్ధరించి సభ్యులకు కీలక బాధ్యతలు అప్పగించింది. సభ్యులు ప్రతి బుధ, శుక్రవారాల్లో పాఠశాలలకు వచ్చి మరుగుదొడ్ల చిత్రాలు తీయాలని ఆదేశాలు వచ్చాయి. వారికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య (ఐడీ) పాస్‌వర్డ్‌లు కేటాయించారు. ఆ సంఖ్యతో ఐఎంఎంఎస్ యాప్‌ను తెరిచి మరుగుదొడ్ల చిత్రాలను అప్‌లోడ్ చేయాలి. దీనిపై కమిటీ సభ్యులకు అవగాహన కల్పిస్తున్నారు. ఒక్కో కమిటీలో 15 నుంచి 21 మంది వరకు సభ్యులు ఉండగా బడుల పరిశుభ్రత బాధ్యతలను వీరికే అప్పగించింది. కమిటీ సభ్యులు, సచివాలయ సంక్షేమ సహాయకులు మరుగుదొడ్ల చిత్రాలు తీయాలని నిర్ణయించింది. వీటిని ఐఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేసేలా తర్ఫీదు ఇవ్వాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించింది.

మార్కాపురం నియోజకవర్గంలో		
పాఠశాలలు	సంఖ్య	విద్యార్థులు
ప్రాథమిక	646	42,767
ప్రాథమికోన్నత	132	18,306
ఉన్నత పాఠశాలలు	203	58,548


ఆర్.కొత్తపల్లిలోని ప్రాథమిక పాఠశాల

పరిసరాల శుభ్రతకు పెద్దపీట

కమిటీ సభ్యులకు ఫొటోలు తీసే విషయంపై, యాప్‌లో అప్‌లోడ్ చేసే విధానంపై అవగాహన కల్పిస్తున్నాం. ఎక్కడైనా మరుగుదొడ్లలో అపరిశుభ్రత కనిపించినా మరమ్మతులకు గురైన ప్రధానోపాధ్యాయుల దృష్టికి వారు తీసుకురావాలి. పాఠశాలల్లో పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నాం.

– ఎ.చంద్రమౌళీశ్వర్, డీవైఈవో, మార్కాపురం.

కనిగిరి

• కనిగిరి • దర్శి • కొండపి

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే:

సమస్య: సీఎస్ పురం గ్రామంలోని ప్రధాన రహదారి, బస్టాండ్ కూడలిలో రాత్రివేళల్లో పందులు సంచరిస్తున్నాయి. దీంతో వాహన చోదకులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి పందులు రాకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలి. – పి.సత్యం, స్థానికుడు

సమాధానం: పందుల యజమానులతో మాట్లాడి రహదారిపైకి రాకుండా ఉండేలా చర్యలు తీసుకుంటాం. – వి.బ్రహ్మానందరెడ్డి, పంచాయతీ కార్యదర్శి

తాళ్లూరు, న్యూస్‌టుడే :

సమస్య: మండలంలోని శివరాంపురం నుంచి దర్శి-చీమకుర్తి ప్రధాన రహదారికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. రాకపోకలు సాగించే ప్రజలు, రైతులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి. – వెంకటేశ్వర్లు, శివరాంపురం.

సమాధానం: సమస్యను విచారించి వీలైనంత త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తాం – వెంకటేశ్వర్లు, ఏఈ, పంచాయతీరాజ్‌శాఖ.

ఆసుపత్రుల్లోని పరిస్థితులపై డీఎంహెచ్‌వో ఆరా

ఈనాడు కథనానికి స్పందన

తాళ్లూరు, న్యూస్‌టుడే: దర్శి నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద అపరిశుభ్రత నెలకొంది. ఈ విషయమై ఈనాడులో సోమవారం 'ఆసుపత్రులు.. అధ్వాన పరిస్థితులు' శీర్షికన ప్రచురితమైన కథనానికి డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్ స్పందించారు. ఆయా పీహెచ్‌సీల్లో నెలకొన్న పరిస్థితులు గురించి ఆయన సంబంధిత వైద్యులతో మాట్లాడి తెలుసుకున్నారు.

వినతులు అందించి.. పరిష్కారానికి అర్జించి..

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో పలు భూ సమస్యలు గత ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోవడం లేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా బాలవీరాంజనేయ స్వామికి పలువురు వినతి పత్రాలు అందజేశారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయం వద్ద సోమవారం తహసీల్దార్ రవి ఆధ్వర్యంలో మీ కోసం కార్యక్రమంలో మంత్రి స్వామి ముఖ్య అతిథిగా పాల్గొని వినతులు స్వీకరించారు. ప్రభుత్వం తరఫున సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. నూతన పింఛన్లు, నివాస గృహాల బిల్లులు, నివేశ స్థలాలు, తదితర పథకాలు మంజూరు కోసం మొత్తం 90 వరకు అర్జీలు అందించినట్లు అధికారులు తెలిపారు.

నిషేధిత జాబితా నుంచి తొలగించాలి



మండలంలోని సోమరాజుపల్లి, సింగరాయకొండ, పాత సింగరాయకొండ గ్రామాల పరిధిలో సుమారు 2,500 ఎకరాల భూములు దేవాదాయ శాఖ పరిధిలోకి మారి నిషేధిత భూముల జాబితాలో నమోదయ్యాయి. దీంతో పిల్లల చదువులు, వివాహాల కోసం బ్యాంకుల నుంచి రుణం పొందలేకపోతున్నాం. ఆ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలి. -సింగయ్య, సోమరాజుపల్లి.

విద్యుత్తు సమస్యలతో తీవ్ర ఇబ్బందులు




నిత్యం విద్యుత్తు సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. సరఫరాలో హెచ్చుతగ్గుల వల్ల ఇళ్లలోని గృహోపకరణాలు కాలిపోతున్నాయి. వర్షాకాలంలో గాలులకు తీగల వెంబడి మంటలు చెలరేగుతున్నాయి. ఎస్సీ కాలనీలో కరెంట్ నిలిచిపోయి అంధకారంలో ఆ ప్రాంత వాసులు గడపాల్సి వస్తుంది. ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కరించాలి. -నక్కా బ్రహ్మేశ్వరరావు, పాతసింగరాయకొండ

నివేశ స్థలం కేటాయించాలి



గత వైకాపా హయాంలో నివేశన స్థలం కేటాయించాలని అధికారులను విన్నవించుకున్నా పట్టించుకోలేదు. అద్దె ఇంట్లో జీవిస్తున్నా. కూలీ పనులు చేసుకుంటూ కుటుంబం పోషించుకుంటున్నా. వైకాపా నాయకుల బెదిరింపులతో వివిధ కారణాలు చూపుతూ సచివాలయ సిబ్బంది నేను అనర్హులుగా పేర్కొని సంక్షేమ పథకాలు అందకుండా చేశారు. కూటమి ప్రభుత్వమైనా సంక్షేమ పథకాలు అందించాలి. –షేక్ అమీదున్నా, సింగరాయకొండ.

సాగు నీరు అందడం లేదు..



బింగినపల్లి గ్రామ పంట చెరువు కాల్వల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి సాగు భూములకు నీరు సక్రమంగా అందడం లేదు. చెరువు తూములు ధ్వంసం కావడంతో ద్వారా నీరు వృథాగా పోతుంది. అలాగే రాత్రుల సమయంలో కొందరు చెరువులో మట్టిని అక్రమంగా తరలిస్తుండటంతో భారీ గోతులు ఏర్పడి పశువులు, జీవాలు ప్రమాదాల బారిన పడుతున్నాయి. అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలి. –సన్నెబోయిన మాలకొండయ్య, బింగినపల్లి.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

ముండ్లమూరు, న్యూస్‌టుడే: ముండ్లమూరు ఆదర్శ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని ఐశ్వర్య జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ పూర్ణచంద్రరావు తెలిపారు. ఇటీవల జరిగిన ఖేలో ఇండియా ఖోఖో పోటీల్లో రాష్ట్రం తరుపున ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ. 1,48,520

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: మిట్టపాలెం నారాయణ స్వామి దేవస్థానం ఆదివారం ఆదాయం రూ. 1,48,520 వచ్చిందని ఈవో ఎస్. నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక ఛైర్మన్ కె.చిన్నఆదినారాయణ తెలిపారు. స్వామి వారి దర్శన టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ. 77,560, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ. 22,900, శాశ్వత అన్నదాన పథకానికి రూ. 48,060 విరాళాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

నిర్వహణ లేక.. ఆర్వోప్లాంట్లు నిస్తేజం

పామూరు, న్యూస్‌టుడే:

గ్రామస్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన శుద్ధజల కేంద్రాలు గత పాలకుల నిర్వాకంతో చాలా చోట్ల మూలకు చేరాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తాగేందుకు శుద్ధజలాలు కరవై చేతిపంపుల నుంచే వచ్చే ఫ్లోరిన్ నీటితో వారు దాహార్తి తీర్చుకుంటున్నారు. రోగాల బారిన పడుతున్నారు.

పట్టించుకోని అధికారులు..

2017లో అప్పటి తెదేపా ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు అధిక మోతాదులో ఫ్లోరిన్ కలిగిన నీటిని తాగి వ్యాధుల బారిన పడుతున్నారని గుర్తించి ఆర్వో ప్లాంట్లను నిర్మించింది. నియోజకవర్గంలోని సీఎస్‌పురం, పీసీపల్లి, పామూరు, వెలిగండ్ల మండలాల్లోని 50 నీటిశుద్ధి పథకాలను ఏర్పాటు చేసింది. సుమారు 3.5 కోట్ల ఖర్చు వరకు చేసింది. ప్రభుత్వం వీటి ద్వారా 20 లీటర్ల శుద్ధజలాన్ని ప్రజలకు రూ.2కే అందించింది. వీటి నిర్వహణను పంచాయతీలు, గ్రామీణ నీటిసరఫరా అధికారులకు అప్పగించారు. ఇందులో ప్రస్తుతం 26 పథకాలు మాత్రమే వినియోగంలో ఉన్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెబుతున్నారు. ఈ కేంద్రాలు అప్పట్లో బాగా పనిచేసినా గత వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పూర్తిగా గాలికొదిలేసింది. నిర్వహణ, మరమ్మతులకు కనీస నిధులు దాఖలాలు లేవు. దాంతో చాలా చోట్ల అవి మూలకు చేరాయి. పలు చోట్ల పథకానికి సంబంధించిన కొన్ని వస్తువులు దెబ్బతిన్నాయి. సి.ఎస్.పురం మండలంలోని జంగంవారిపల్లి, గోరంటపల్లి తదితర గ్రామాల్లోని నీటి శుద్ధి పథకాలు ఏళ్లతరబడి మరమ్మతులకు గురై పనిచేయడంలేదు. కేంద్రాలు మూతపడడంతో తాగునీటికి అవస్థలు పడుతున్నామని, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి నియోజకవర్గంలోని మండలాల్లోని గ్రామాల్లో పనిచేయని నీటి శుద్ధి పథకాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ వి.విశ్వనాథరెడ్డి న్యూస్‌టుడే వివరణ కోరగా.. నీటిశుద్ధి పథకాలకు మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

■ గ్రామీణులకు అందని శుద్ధజలం

నియోజకవర్గంలో నీటిశుద్ధి పథకాల వివరాలు

మండలం	ఉన్న పథకాలు	పని చేస్తున్నవి	పని చేయనివి
సి.ఎస్.పురం	22	05	17
పీసీపల్లి	14	10	04
పామూరు	03	03	00
వెలిగండ్ల	11	08	03
మొత్తం	50	26	24



సి.ఎస్.పురం మండలం గోరంటపల్లిలో పనిచేయని నీటిశుద్ధి పథకం

మారణహోమాన్ని వ్యతిరేకిస్తూ నిరసన

కనిగిరి, టంగుటూరు, న్యూస్‌టుడే: గాజాపై ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధం ఆపాలంటూ సోమవారం కనిగిరి పట్టణంలో సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో శాంతి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ యాసిన్ మాట్లాడుతూ.. హమాస్ ఉగ్రవాద సంస్థను అంతమొందిస్తున్నామని చెప్పి.. గతేడాదిగా పాలస్తీనా, లెబనాన్ దేశాల్లో బాంబులు వేస్తూ వేలాది మంది ప్రాణాలు ఇజ్రాయెల్ తీస్తోందని దుయ్యబట్టారు. ఇప్పటికి యుద్ధం ఆపకపోతే మరో ప్రపంచ యుద్ధంగా మారే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి పీసీ కేశరావు వివిధ పార్టీల నాయకులు బాలిరెడ్డి, బషీర తదితరులు పాల్గొన్నారు. ● ఇజ్రాయెల్ సాగిస్తున్న మారణహోమాన్ని వెంటనే ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. పాలస్తీనాకు సంఘీభావంగా టంగుటూరు బొమ్మల కూడలిలో వామపక్ష పార్టీల నాయకులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.



దొనకొండ: పూజల్లో పాల్గొన్న భక్తులు



సింగరాయకొండలో చెట్టుపుహాలక్ష్మమ్మ..

జూదరుల అరెస్టు

కనిగిరి, న్యూస్‌టుడే: మున్సిపాలిటీలోని మాచవరం సమీపంలోని పొగాకు బ్యారెన్ వద్ద జూదం ఆడుతున్న ఏడుగురిని కనిగిరి పోలీసులు సోమవారం రాత్రి అరెస్టు చేశారు. వారిని వద్ద నుంచి రూ. 39,530ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

అంగన్‌వాడీ కార్యకర్తపై విచారణ

వెలిగండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని మల్లంరాజుపల్లి మినీ అంగన్‌వాడీ కార్యకర్త ఫీడింగ్ ఇవ్వకుండా దుర్వినియోగానికి పాల్పడుతుందని గ్రామస్థులు ఐసీడీఎస్ పీడీకి ఫిర్యాదు చేయడంతో సూపర్‌వైజర్ కమలకుమారి సోమవారం విచారణ చేపట్టారు. పిల్లలు, అంగన్ వాడీ కార్యకర్త హాజరుపట్టిక, సంతకాల తేడాను గుర్తించారు. అదే విధంగా ఫీడింగ్ తరుగుదల ఉన్నట్లు తెలుసుకున్నారు.

వైభవంగా దసరా ఉత్సవాలు



తాళ్లూరులోని అన్నపూర్ణదేవిగా..

న్యూస్‌టుడే బృందం: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా ఆయా రోజైనా సోమవారం వివిధ ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులు పూజలు నిర్వహించారు. భైరవకోనలో త్రిముఖ దుర్గాంబ అమ్మవారు మోహినిదేవిగా, పొమూరులో వాసవిమాత నారాయణి దేవిగా, తాళ్లూరులో వెలసిన వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు మహాచండీదేవిగా, గుంటిగంగలోని గంగాభవాని అమ్మవారు గాయత్రీదేవిగా, దర్శిలోని పోలేరమ్మ తల్లి శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ముండ్లమూరు మండలం మారెళ్లలోని హరిహరదత్త క్షేత్రంలోని ప్రసూనాంబ అమ్మవారికి మహిళలు కుంకుమార్చన పూజలు నిర్వహించారు. కనిగిరి పట్టణంలో కన్యకాపరమేశ్వరి దేవస్థానం, కనకదుర్గమ్మ కోవెలలో మహిళలు సామూహిక కుంకుమార్చనలు, విశేష పూజలు నిర్వహించారు.



కనిగిరిలో మహాచండీదేవిగా



దర్శిలో శాకంబరీదేవిగా పోలేరమ్మతల్లి



భైరవకోనలో మోహినిదేవి అలంకరణలో త్రిముఖ దుర్గాంబ

నియోజకవర్గంలో ట్రిపుల్ ఐటీ ఏర్పాటుకు కృషి

పామూరు, న్యూస్‌టుడే: కనిగిరి నియోజకవర్గంలో ట్రిపుల్‌ఐటీని ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెదేపా ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు దూబగుంటలో ట్రిపుల్‌ఐటీని మంజూరు చేసి ఇక్కడ శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్ పనుల్లో భాగంగా కనిగిరి, పామూరు రైల్వేస్టేషన్ల నిర్మాణానికి టెండర్లు పిలిచినట్లు తెలిపారు. కనిగిరి: కనిగిరి సామాజిక వైద్యశాల అభివృద్ధికి కనిగిరి రూరల్ డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ. 1 లక్ష విరాళాన్ని స్థానిక అమరావతి మైదానంలో సోమవారం ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డికి అందజేశారు. డీలర్స్ అసోసియేషన్ నాయకులు ముచ్చుమూరి చెంచిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కనిగిరి: ఎమ్మెల్యే ఉగ్రకు విరాళం అందజేస్తున్న దాతలు

అధ్వానంగా సిమెంట్ రహదారి



అధ్వానంగా శ్రీ రాంబావి వీధిలో నుంచి వచ్చే రహదారి

సి.ఎస్.పురంలోని శ్రీరాంబావి వీధి నుంచి ఏనిమెట్లవీధిలోని ప్రధాన ప్రాథమిక పాఠశాలకు వెళ్లే సిమెంట్ రహదారి అధ్వానంగా తయారైంది. రోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్లు, పిచ్చిమొక్కలు దట్టంగా పెరగడంతో రహదారి పూర్తిగా మూసుకుపోయింది. ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లే లేని పరిస్థితి. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, రాకపోకలు సాగించేందుకు ఇక్కట్లు పడుతున్నారు. శ్రీరాంబావి వీధి రహదారి నుంచి వచ్చే రహదారి ప్రారంభంలో సిమెంట్ రహదారిపై మట్టితో నిండి వర్షం కురిస్తే బురదమయంగా మారుతుంది. అధికారులు, పాలకులు స్పందించి చెట్లు, రహదారిపై మట్టిని, వ్యర్థాలను తొలగించి రోడ్డు పరిశుభ్రంగా ఉండేలా, లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై 'న్యూస్‌టుడే' పంచాయతీ కార్యదర్శి వి.బ్రహ్మానందరెడ్డి వివరణ కోరగా.. చెట్లు తొలగించి రహదారిని శుభ్రపరిచేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. - న్యూస్‌టుడే, సి.ఎస్.పురం

అధికారుల బాధ్యతల స్వీకరణ

పొన్నలూరు: పొన్నలూరు ఎస్సైగా కట్టా అనూక్ సోమవారం నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన గుంటూరు జిల్లా కార్యాలయం వీఆర్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

సిబ్బంది నిర్లక్ష్యం.. రోగులకు శాపం..

కొండపి గ్రామీణం: సిబ్బంది నిర్లక్ష్యంతో రోగులకు అవస్థలు పడుతున్నారు. కొండపి-1 ఆరోగ్య కేంద్రం ఎంఎల్‌హెచ్‌పీ శాంతి శిక్షణ నిమిత్తం ఒంగోలు వెళ్తూ కేంద్రం తాళాలు తన వెంట తీసుకుపోవడంతో రోజంతా సెంటర్ మూతపడింది. వైద్యం కోసం వచ్చిన రోగులు నిరాశగా వెనుదిరిగారు.

నగల దుకాణంలో పర్సు చోరీ

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: నగల దుకాణంలో ఓ మహిళ పర్సును అపహరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మద్దిపూడి మండలం రాజుపాలేనికి చెందిన జి.ఆదిలక్ష్మి, వారి బంధువులు నగల కొనుగోలుకు... ఒంగోలు గాంధీరోడ్డులోని ఓ బంగారు ఆభరణాల దుకాణానికి సోమవారం వచ్చారు. వారి వెనకే నిల్చున్న ఇద్దరు మహిళలు... ఆదిలక్ష్మి పర్సును అపహరించారు. అందులో రూ. 25 వేల విలువైన వస్తువులు ఉన్నట్లు బాధితులు చెబుతున్నారు. ఆ మేరకు ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల ఆచూకీ కోసం సీసీటీవీ పుటేజీని పరిశీలిస్తున్నారు.

హెడ్ కానిస్టేబుల్‌కు గాయాలు

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ తీవ్ర గాయాలయ్యాయి. భగీరథ కెమికల్స్ సమీపంలోని సాగర్ కాలువ వద్ద సోమవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. టంగుటూరు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న జయరాజు... కొండపి నుంచి ఒంగోలుకు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. భగీరథ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించే క్రమంలో పది అడుగుల లోతులో ఉన్న కాలువలో పడిపోయాడు. ఈ ప్రమాదంలో ఆయన కాలు విరిగి... తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు వెంటనే ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు బోల్తా.. దంపతులకు...

కనిగిరి: కారు బోల్తా పడి దంపతులకు గాయాలైన సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని మాచవరం జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. వివరాల్లోకెళితే.. పొదిలిలోని కొత్తూరుకు చెందిన చక్కా అశోక్ నేవి ఉద్యోగి, తన భార్య భార్గవి, మూడేళ్ల కుమారుడు అశ్విన్ ఉదయం కడప జిల్లా పొద్దుటూరుకు సొంత కారులో బయలుదేరారు. మాచవరం వద్దకు వచ్చే సరికి రోడ్డుపై గుంత కనిపించడంతో ఒక్కసారిగా బ్రేక్ వేయగా.. బోల్తా పడింది. ఈ ఘటనలో అశోక్‌కు స్వల్ప గాయాలుకాగా, భార్గవికి కాలు విరిగింది. సమాచారం అందుకున్న సీఐ షేక్ ఖాజావలి, ఎస్సై టి.శ్రీరామ్‌లు అక్కడికి చేరుకుని కారులో ఇరుక్కుపోయిన వారిని బయటకు తీశారు. 108 వాహనం ద్వారా ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.



కారులో ఇరుక్కు పోయిన వారిని బయటకు తీస్తున్న పోలీసులు

ఆటోను ఢీకొన్న ద్విచక్ర వాహనం

శంకరాపురం(ముండ్లమూరు), న్యూస్‌టుడే: ఆటోను ద్విచక్రవాహనం ఢీ కొన్న సంఘటన మండలంలోని శంకరాపురం వద్ద అద్దంకి- దర్శి ప్రధాన రహదారిలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు నుంచి కడపకు ఆటో వెళ్తోంది. అదే క్రమంలో దర్శి మండలం పాపిరెడ్డిపాలెంకు చెందిన లక్కు రవీంద్రరెడ్డి ద్విచక్రవాహనంపై అద్దంకి నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. శంకరాపురం వద్దకు రాగానే ఆటో వెనుక భాగాన్ని ద్విచక్రవాహనం ఢీ కొట్టడంతో రవీంద్రరెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుణ్ని 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

పొగాకు బోర్డులో ముగిసిన వేలం

టంగుటూరు: 2024-25 పొగాకు పంట కాలం టంగుటూరు బోర్డు పరిధిలో సోమవారంతో విక్రయాలు ముగిశాయి. ఈ ఏడాది పొగాకు వేలం ప్రక్రియ 152 రోజుల పాటు సాగింది. బోర్డు ముగింపు సందర్భంగా రైతులు, బోర్డు సిబ్బంది, కంపెనీల ప్రతినిధులతో ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బోర్డు వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రైతులు ఎన్నడూ చూడని రీతిలో గత మూడేళ్లుగా చవి చూశారన్నారు. వచ్చే పంట కాలంలో ఇవే ధరలు కొనసాగకపోవచ్చన్నారు. రైతులు ఇచ్చిన విస్తీర్ణంకు మించి సాగు చేసి నష్టపోవద్దని తెలియజేశారు. అనంతరం సూపరింటెండెంట్ శ్రీనివాసరావును, సిబ్బందిని రైతులు సత్కరించారు. ● **రూ.45 కోట్లు రైతుల ఖాతాల్లోకి...:** బోర్డు పరిధిలో ఈ ఏడాది 2,865 మంది రైతులు, 2,865 బ్యారన్‌లు నమోదయ్యాయి. 5,353.37 హెక్టార్లకు అనుమతులు లభించగా 7,147 హెక్టార్లలో పంటను సాగు చేశారు. 10 మి.కి పొగాకు విక్రయానికి అనుమతులు లభించగా 16.1 మి.కిలోలు విక్రయించారు. ఈ ఏడాది సగటు కి.లో పొగాకు రూ. 279 ధర లభించింది. అలాగే బోర్డులో విక్రయించగా వచ్చిన రూ. 45,021,85,411 (కోట్ల) ఆదాయం వచ్చింది. ● **కొండపి గ్రామీణం:** కొండపి వేలం కేంద్రంలో ఆఖరి రోజు కిలో పొగాకు కనిష్ఠ ధర రూ. 49 పలికిందని వేలం నిర్వహణాధికారి జి. సునీల్ కుమార్ తెలిపారు. బోర్డు పరిధిలోని రైతులు వేలం కేంద్రానికి 2028 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా, అందులో 1899 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ఠ ధర రూ. 358 పలికిందన్నారు.

బిల్లుల చెల్లింపునకు లభించనున్న మోక్షం

● కూటమి ప్రభుత్వ నిర్ణయంపై లబ్ధిదారుల హర్షం

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే:

సొంతిల్లు.. ప్రతి పేద, మధ్యతరగతి కుటుంబాల కల. వారి స్వప్నాన్ని నేరవేర్చాలనే లక్ష్యంతో గత తెదేపా ప్రభుత్వం ఎన్టీఆర్ గృహనిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. వేలాది గృహాలు మంజూరు చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కొక్క ఇంటికి ఓసీ, బీసీ వర్గాలకు రూ. 1.50 లక్షలు, ఎస్సీ వర్గానికి చెందితే రూ. 2 లక్షలు, ఎస్టీలకైతే రూ. 2.25 లక్షల చొప్పున నిధులు కేటాయించింది. అనంతరం అధికారంలోకి వైకాపా అప్పట్లో నిర్మించుకున్న గృహాలకు బిల్లుల చెల్లింపులను నిలిపేసింది. గత ప్రభుత్వ హయాంతో లబ్ధిదారులు బిల్లులు కోసం కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా పాలకులు కనికరించలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి లబ్ధిదారులకు బిల్లులు విడుదల చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొండపి నియోజకవర్గంలోని ఎన్టీఆర్ గృహలబ్ధిదారుల వివరాలు..

మండలాలు	లబ్ధిదారుల సంఖ్య
కొండపి	625
టంగుటూరు	635
సింగరాయకొండ	872
పొన్నలూరు	576
జరుగుమల్లి	558
మద్దిపూడి	666

పరిశీలిస్తున్న అధికారులు..

కొండపి నియోజకవర్గంలోని కొండపి, టంగుటూరు, సింగరాయకొండ, పొన్నలూరు, జరుగుమల్లి, మద్దిపూడి మండలాల పరిధిలో ఉన్న 3,932 ఎన్టీఆర్ గృహాలు ఉన్నాయి. గత తెదేపా ప్రభుత్వంలో నిర్మించుకుని వైకాపా హయాంలో నిలిచిపోయిన గృహాల స్థితిగతులపై ఆయా శాఖ అధికారులు ఆరా తీస్తున్నారు. నిర్మాణాలు ఏ స్థాయిలో ఉన్నాయో క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత వివరాలను అంతర్జాలంలో పొందుపరుస్తున్నారు.



కొండపిలో లబ్ధిదారుల వివరాలు సేకరిస్తున్న డీఈఈ సత్యనారాయణ, ఏఈ భూపతి, సిబ్బంది.

కొందరు అప్పుచేసి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారని. . మరికొందరు మధ్యలోనే నిలిపేసి అద్దె భవనాల్లో ఉంటున్నట్లు అధికారులు గుర్తించారు. లబ్ధిదారులందరికీ త్వరలోనే బిల్లులు ప్రభుత్వం చెల్లిస్తుందని అధికారులు చెబుతున్నారు. ఈ విషయమై డీఈఈ ఎస్‌వీవీ సత్యనారయణ మాట్లాడుతూ.. కొండపి నియోజకవర్గంలో ఎన్టీఆర్ గృహాలు నిర్మించిన పేదలకు బిల్లులు చెల్లింపునకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. ఇంటింటికి తిరిగి స్థితిగతులను తెలుసుకొని వాటి వివరాలతో పాటు, బ్యాంకు పుస్తకాలను అంతర్జాలంలో పొందుపరుస్తున్నామని పేర్కొన్నారు.

జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపిక



లక్ష్మీదీపిక

కొత్తపట్నం, న్యూస్‌టుడే: గవళ్లపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని పాదాల లక్ష్మీదీపిక... రెజ్లింగ్‌లో సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. కృష్ణా జిల్లా నున్న జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించి... ఈ నెల 23 నుంచి 27 వరకు మీరట్ (ఉత్తర్ ప్రదేశ్)లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థినిని పత్తిపాటి శ్రీనివాసరావు, పీడీ చక్కా వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు... సోమవారం అభినందించారు.

ఒంగోలు

•ఒంగోలు • సంతనూతలపాడు

వైద్య విద్యార్థి ప్రతిభ

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: విశాఖలోని గీతం వైద్య కళాశాలలో ఈ నెల 4, 5 తేదీల్లో నిర్వహించిన ఫార్మకాలజిస్టుల జాతీయ సదస్సులో పాల్గొన్న ఒంగోలు వైద్య కళాశాల పీజీ విద్యార్థి లోకేశ్‌కుమార్ ప్రతిభ చాటారు. ఆయన రూపొందించిన 'రొటీన్ మెడిసిన్ స్ట్రైక్స్- ఒన్ కేస్ ఆఫ్ బబూన్ సిండ్రోమ్' పోస్టర్‌కు తృతీయ బహుమతి లభించింది. ఈ సందర్భంగా కళాశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఏడుకొండలరావు, ఇతర ఆచార్యులు ఆయనను అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ కొండలరావు

నిధులు మింగేసి...
గుంతలు వదిలేశారు!

◆ గత పాలకుల తీరుతో నగర దారులు ఛిద్రం

◆ రాకపోకలకు వాహనదారులకు తప్పని ఇక్కట్లు



పాత మార్కెట్ ప్రాంతంలో...



బాపూజీ కాంప్లెక్స్ సమీపంలో..



కర్నూలు రోడ్డు పైవంతెన వద్ద ఇలా...



బండ్లమిట్ట కూడలిలో...

న్యూస్‌టుడే – ఒంగోలు నగరం

నగరంలో రహదారి గుంతల మరమ్మతుల పేరిట గత పాలకులు నిధులు మింగేశారు. తూతూమంత్రం పనులతో సరిపెట్టారు. వర్షాలకు ఆ గోతులు మరింత పెరిగి ఇప్పుడు ప్రజలకు పరీక్ష పెడుతున్నాయి. పలు ప్రాంతాల్లో వాహనదారుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. రాత్రి వేళల్లో తరచూ ప్రమాదాలూ చోటుచేసుకుంటున్నాయి.

ప్యాచ్‌వర్క్‌ల పేరిట స్వాహా...

పురపాలక శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు... గత ఏడాది ఏప్రిల్‌లో నగర పాలక సంస్థ, సచివాలయాల సిబ్బంది సర్వే చేపట్టి ఒంగోలు నగరంలో మొత్తం 862 గుంతలు ఉన్నట్లు గుర్తించారు. వీటికి మరమ్మతులు నిర్వహించేందుకు తొలివిడతగా రూ.58.26 లక్షలతో టెండర్లు పిలవగా... గుత్తేదారులు కుమ్మక్కై 4.5 శాతం అదనంగా కోట్ చేసి పనులు దక్కించుకున్నారు. ఆగస్టు నాటికి 750 గుంతలు పూడ్చినట్లు, రెండు రహదారులు కలిసే చోట మిగిలిన ప్యాచ్‌వర్కులు చేసినట్లు అధికారులు నివేదికలో పేర్కొన్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా... గుంతలను పైపైన కంకరతో కప్పి చదును చేయడంతో కొద్ది రోజులకే యథాస్థితి నెలకొంది. ఆ తరువాతా గోతుల మరమ్మతుల పేరిట నిధులు ఖర్చు చేసినా ప్రయోజనం లేకపోయింది. వైకాపా నేతలే బినామీల పేరిట పనులు చేపట్టడం, ఎవరి స్థాయిలో వారికి వాటాలు వెళ్లడంతో ఈ వ్యవహారాన్ని ఎవరూ పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. చాలా ప్రాంతాల్లో పనులు చేయకుండానే చేసినట్లు చూపారన్న విమర్శలూ అప్పట్లో వెల్లువెత్తాయి.

నాసిరకం ప్యాచ్‌వర్క్ పనులపై అప్పట్లోనే తెదేపా కార్పొరేటర్లు కౌన్సిల్‌లో నిలదీసినా పట్టించుకున్నవారు కరవయ్యారు. చివరకు ఈ విషయమై లోకాయుక్తనూ ఆశ్రయించారు.

మరమ్మతులు చేపడతాం...

సచివాలయాల వారీగా నగరంలోని రహదారి గుంతల వివరాలు సేకరించి... వాటి మరమ్మతులకు సుమారు రూ.10 లక్షలతో టెండర్లు పిలిచారు. మరికొన్ని పనులూ చేయాల్సి ఉన్నందున అదనంగా నిధులు కేటాయించి... పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం.

– చంద్రయ్య, మున్సిపల్ ఇంజినీర్

ప్రయాణం నరకప్రాయం...

గత ప్రభుత్వ హయాంలో భూగర్భ విద్యుత్తు లైన్ వేసేందుకు కర్నూలు రోడ్డులోని విద్యుత్తు కార్యాలయం నుంచి మంగమ్మ కళాశాల కూడలి వరకు రహదారిని తవ్వారు. కేబుల్ వేశాక మట్టితో కప్పి చదును చేసి వదిలేశారు. తరువాత మట్టి కుంగిపోయి గుంతలు తేలి నేటికీ సమస్య కొనసాగుతోంది. కొత్తగా రోడ్డు నిర్మించాల్సి ఉన్నా పట్టించుకోలేదు. విజయవాడ, గుంటూరు వైపు నుంచి ఒంగోలులోకి వాహనాలు వచ్చే మార్గం కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. వర్షాలకు ఆయా గుంతల్లో మరింత పెరిగి నీరు నిలిచిపోతుండడంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు.

● ఆప్టికల్ ఫైబర్ లైన్ కోసం అప్పట్లో మంగమూరు రోడ్డు, నిర్మల్‌నగర్, బండ్లమిట్ట, రాజాపానగల్ రోడ్డు, రామనగర్, గోపాలనగర్ తదితర ప్రాంతాల్లో సిమెంట్ రోడ్డు పగలగొట్టారు. పనులు పూర్తయ్యాక రోడ్డు బాగును విస్మరించడంతో ఆయా ప్రాంతాల్లోనూ ఇబ్బందులు కొనసాగుతున్నాయి. →

మంగమ్మ కళాశాల నుంచి కర్నూల్ రోడ్డు వరకు ఇదే పరిస్థితి



నగరంలో ట్రాఫిక్ సమస్యలపై దృష్టి



ట్రాఫిక్ సమస్యపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే జనార్దన్

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం దిశగా... కర్నూలురోడ్డు, సుందరయ్య భవన్ రోడ్డు, మంగమూరు రోడ్డు కూడలి ప్రాంతాల్లో... ట్రాఫిక్, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి సోమవారం రాత్రి పర్యటించారు. గత ప్రభుత్వ చర్యలతో అస్తవ్యస్తంగా మారిన ట్రాఫిక్ వ్యవస్థను చక్కదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వ్యాపారులు, తోపుడుబండ్ల వారికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ దేవానందం, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: నగరంలోని తితిదే కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి నిర్వహించిన కూచిపూడి నృత్య రూపకాలు ఆహూతులను అలరించాయి. శ్రీ నళినీ ప్రియ కూచిపూడి నృత్యనికేతన్ పదో వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ... జిల్లాలో సంగీత కళాశాల ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానన్నారు. విద్యార్థులను నృత్య కళాకారులుగా తీర్చిదిద్దిన గురువు శివకుమారిని అభినందించారు. జడ్పీ మాజీ ఛైర్మన్ ఈదర హరిబాబు, అళహరి చెంచలరావు, కేఆర్‌వీ ప్రసాదరావు, రంగభూమి కళాకారుల సంఘం అధ్యక్షుడు ధేనువుకొండ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో అతిథులు

రొయ్యల చెరువుల తవ్వకంపై ఫిర్యాదు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: కొప్పోలు సమీపంలో పోతురాజు కాలువ పక్కన అనుమతులు లేకుండా చేపడుతున్న రొయ్యల చెరువుల తవ్వకం పనులను ఆపించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియాకు గ్రామస్థులు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ విషయమై గతంలోనూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆ ప్రాంతంలో రొయ్యల సాగు చేపడితే పరిసరాల్లోని పంట పొలాలు దెబ్బతింటాయన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు పరికరాల అందజేత

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: కొత్తపట్నం మండలానికి చెందిన వి.వెంకటసుబ్బయ్య... శ్రవణ యంత్రం, మద్దిపాడు నివాసి ఎన్.నిత్యశ్రీ... వీల్‌ఛైర్ కోసం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు అర్జీలు సమర్పించారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ నుంచి వాటిని మంజూరు చేసి సోమవారం అందజేశారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

చీమకుర్తి, న్యూస్‌టుడే: త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చీమకుర్తిలో సోమవారం... త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రదర్శన చేపట్టారు. సమితి సభ్యులు ఏడుకొండలు, సుబ్బారావు, కృష్ణారెడ్డి, వీరాంజనేయులు, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కాలనీ వాసులే బాగుచేసుకున్నారు!





ఉప్పుగుండూరు అంబేడ్కర్ కాలనీ నుంచి సమీపంలోని నాగన్నవాగులోకి మురుగు వెళ్లేలా గత ప్రభుత్వ హయాంలో కాలువ నిర్మించారు. తక్కువ వెడల్పుతో నిర్మించడం, ఓవైపు గోడ లోపలకు ఒరిగిపోవడంతో మురుగు ముందుకు సాగక సమస్య నెలకొంది. తగిన చర్యలు తీసుకోవాలని అప్పట్లోనే అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. దీంతో కాలనీవాసులే స్వచ్ఛందంగా జేసీబీని ఏర్పాటు చేసి... సోమవారం కాలువను బాగు చేయించారు.

– న్యూస్‌టుడే, నాగులుప్పలపాడు

వివాహిత ఆత్మహత్యాయత్నం... రోజంతా కలకలం

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంటున్నట్లుగా లేఖ రాసి బస్సులో వదిలి వెళ్లడంతో కలకలం రేగింది. చివరకు పోలీసులు ఆమెను గుర్తించి ఆసుపత్రిలో చేర్చడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూలు జిల్లా నందనవనం గ్రామానికి చెందిన జి.లీలావతి అనే మహిళ ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వచ్చారు. ఒంగోలు బస్సు ఎక్కి సోమవారం తెల్లవారుజాము 5.30 గంటలకు నగరానికి చేరుకున్నారు. తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నానంటూ తన భర్తను ఉద్దేశించి రాసిన లేఖతో పాటు... బ్యాగు, చరవాణిని బస్సులో వదిలి వెళ్లిపోయారు. విషయాన్ని గుర్తించిన బస్సు సిబ్బంది వెంటనే అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు అప్రమత్తమై ఒకటో పట్టణ పోలీసులకు తెలియజేశారు. ఆమె ఫోన్‌కు సోదరుడి నుంచి కాల్ రావడంతో... ఆమె కర్నూలు జిల్లా నందనవనం వాసిగా గుర్తించారు. ఆమె ఆచూకీ కనుగొనేందుకు పోలీసులు హైరానా పడ్డారు. సాయంత్రానికి... హెయిర్ కలర్ ఆయిల్ తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఆమెను గుర్తించి జీజీహెచ్‌లో చేర్చారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

హెడ్ కానిస్టేబుల్‌కు గాయాలు

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ తీవ్ర గాయాలయ్యాయి. భగీరథ కెమికల్స్ సమీపంలోని సాగర్ కాలువ వద్ద సోమవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. టంగుటూరు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న జయరాజు... కొండపి నుంచి ఒంగోలుకు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. భగీరథ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించే క్రమంలో పది అడుగుల లోతులో ఉన్న కాలువలో పడిపోయాడు. ఈ ప్రమాదంలో ఆయన కాలు విరిగి... తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు వెంటనే ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నగల దుకాణంలో పర్సు చోరీ

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: నగల దుకాణంలో ఓ మహిళ పర్సును అపహరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మద్దిపూడి మండలం రాజుపాలేనికి చెందిన జి.ఆదిలక్ష్మి, వారి బంధువులు నగల కొనుగోలుకు... ఒంగోలు గాంధీరోడ్డులోని ఓ బంగారు ఆభరణాల దుకాణానికి సోమవారం వచ్చారు. వారి వెనకే నిల్చున్న ఇద్దరు మహిళలు... ఆదిలక్ష్మి పర్సును అపహరించారు. అందులో రూ.25 వేల విలువైన వస్తువులు ఉన్నట్లు బాధితులు చెబుతున్నారు. ఆ మేరకు ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల ఆచూకీ కోసం సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు.

పోక్సో కేసుపై డీఎస్పీ విచారణ

చీమకుర్తి, న్యూస్‌టుడే: ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు... రామతీర్థంలో పోక్సో కేసు విచారణ చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడుకు చెందిన అరవై ఏళ్ల వృద్ధుడు పెరుమాళ్లు రామతీర్థంలో కంకర, రాళ్లు కొడుతూ జీవనం సాగిస్తున్నాడు. మూడు రోజుల క్రితం వారి ఇంటి పక్కన ఉండే ఓ చిన్నారి పట్ల అనుచితంగా ప్రవర్తించడంతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం... గ్రామానికి వచ్చిన డీఎస్పీ వివరాలు సేకరించారు. సీఐ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్యాపాత్యాలో జిల్లా జట్టు సత్తా



క్రీడాకారులను అభినందిస్తున్న సంఘం ప్రతినిధులు

ఒంగోలు నగరం: ఆత్యాపాత్యా సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు సత్తా చాటింది. గత రెండు రోజులుగా నెల్లూరులో జరుగుతున్న పోటీల్లో జట్టు క్రీడాకారులు సమష్టిగా రాణించి మూడో స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నంబూరి శ్రీనివాసులు, జి.సుబ్బారావు వారిని అభినందించారు.

గాజాపై దమనకాండ తగదు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: గాజాపై ఇజ్రాయిల్ దమనకాండ ఆపాలని కోరుతూ వామపక్షాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.ఎల్.నారాయణ మాట్లాడుతూ అమెరికా ప్రోద్బలంతోనే ఇజ్రాయిల్ దాడులకు తెగబడుతోందని విమర్శించారు. వారికి కేంద్ర ప్రభుత్వం డ్రోన్లు, ఆయుధాలు సరఫరా చేయడం సిగ్గుచేటన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ద్వంద వైఖరి విడనాడి పాలస్తీనా ప్రజలకు అండగా నిలవాలని కోరారు. వామపక్ష నాయకులు డీవీఎన్.స్వామి, సాగర్, ఆర్.వెంకటరావు, కె.వీరారెడ్డి, ఆర్.రామకృష్ణ, ఉప్పుటూరి ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఒంగోలు నగరం: 8008574067 ఒంగోలు గ్రామీణం : 8008564455

ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766

ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

చీమకుర్తి, న్యూస్‌టుడే:

?: చీమకుర్తి బస్టాండ్ కూడలి సమీపంలోని మూడు వీధి దీపాలు గత కొద్ది రోజులుగా వెలగడం లేదు.
– ఎన్.సుబ్రహ్మణ్యం, చీమకుర్తి

✓: వెంటనే మరమ్మతులు చేపడతాం.
– గోపి, ఇంజినీరింగ్ విభాగం పర్యవేక్షకుడు

మద్దిపాడు, న్యూస్‌టుడే:

?: బూరేపల్లి పునరావాస కాలనీ ప్రాథమిక పాఠశాల ఎదుట కాలువలో పిచ్చి మొక్కలు పెరిగి మురుగు ముందుకు సాగడం లేదు. దుర్వాసనతో పాటు దోమల బెడద పెరిగి ఇబ్బంది పడుతున్నాం. – సుంకర రామాంజనేయులు, స్థానికుడు

✓: సిబ్బందిని పంపి కాలువను శుభ్రం చేయించడంతో పాటు... ఆ ప్రాంతంలో ఫాగింగ్ చేపడతాం.
– ప్రియాంక, పంచాయతీ కార్యదర్శి

?: తెల్లబాడు ఎస్సీ కాలనీలో వ్యర్థాలతో కాలువ పూడి పోయి మురుగు పారడం లేదు.– మేరిగ రవీంద్ర, గ్రామస్థుడు

✓: కాలనీలో పారిశుద్ధ్య పనులు చేపట్టి సమస్య పరిష్కరిస్తాం. – సుభాషిణి, పంచాయతీ కార్యదర్శి

బిందు సేద్యానికి జవసత్వాలు

● నిర్వీర్యం చేసిన వైకాపా పాలకులు ● భారీ రాయితీలతో కూటమి ప్రభుత్వ ప్రోత్సాహం



బిందు సేద్యం పరికరాలు

న్యూస్‌టుడే – ఒంగోలు గ్రామీణం, కొత్తపట్నం

జిల్లాలో నీటి వసతి తక్కువ. ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకునేందుకు బిందు, తుంపర సేద్యం పద్ధతులు అవసరం. ఈ దిశగా అన్నదాతలను ప్రోత్సహించేందుకు ఉన్న పథకాలను గత వైకాపా ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. దీంతో చిన్న, సన్నకారు రైతులకు తీరని నష్టం వాటిల్లింది. తాజాగా... ఆ లోటుపాట్లను సరిచేస్తూ, కర్షకులకు మరింత మేలు కలిగేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. బిందు, తుంపర సేద్యానికి అవసరమైన పరికరాలను 45 నుంచి 95 శాతం రాయితీపై అందించేందుకు నిర్ణయించింది. ఇప్పటికే రైతుల వివరాల నమోదుకు శ్రీకారం చుట్టింది.

లక్ష్యం... 1,500 హెక్టార్లు

2003-04 నుంచి జిల్లాలో సూక్ష్మ నీటి పారుదల ప్రాజెక్ట్ అమల్లో ఉంది. ఈ పథకం కింద ఇప్పటివరకు ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాల పరిధిలో సుమారు ఏడు వేల మంది రైతులు లబ్ధి పొందారు. పద్దెనిమిది వేల హెక్టార్ల విస్తీర్ణానికి రాయితీపై బిందు, తుంపర సేద్యం పరికరాలు అందజేశారు. పథకం అమలుకు మరో పాతిక వేల హెక్టార్లు అనుకూలంగా ఉన్నట్లు గుర్తించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండు నియోజకవర్గాల పరిధిలోని ఆరు మండలాల్లో మొత్తం 1,500 హెక్టార్లలో బిందు, తుంపర సేద్యం విధానాలు అమలు చేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. గత ఏడాదితో పోలిస్తే ఇది మూడు రెట్లు అధికం. అర్హులైన రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ వివరాలతో స్థానిక రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. సంబంధిత అధికారులు సచివాలయాల ద్వారా వివరాల నమోదు చేపడుతున్నారు.

బిందు సేద్యం పరికరాలు... అయిదెకరాల్లోపు భూమి ఉన్న రైతులకు 90 శాతం; పదెకరాల్లోపు ఉన్న వారికి 70 శాతం రాయితీపై ఇవ్వనున్నారు. స్ప్రింకర్లు... అయిదెకరాల్లోపు వారికి 55 శాతం; పన్నెండున్నర ఎకరాల్లోపు రైతులకు 45 శాతం రాయితీపై మంజూరు చేయనున్నారు.

గత పాలనలో కుదేలు...

2014-19 మధ్య అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో సుమారు పది వేల హెక్టార్ల విస్తీర్ణంలో బిందు, తుంపర సేద్యానికి రాయితీపై పరికరాలు అందించింది. తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం కేవలం నాలుగు వేల హెక్టార్ల విస్తీర్ణానికే అనుమతిచ్చినా లక్ష్యం పూర్తి చేయలేదు. పైపెచ్చు... కొవిడ్ పరిస్థితులు, నిధులు కొరతంటూ 2020-22 మధ్య పథకం అమలును పూర్తిగా నిలిపేసింది. ఇది ఉద్యాన పంటల సాగుపై తీవ్ర ప్రభావం చూపింది. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులు పండ్ల తోటల సాగుకు దూరమయ్యారు. తాజాగా కూటమి ప్రభుత్వం ఈ విషయమై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో బిందు, తుంపర సేద్యాన్ని మరింత ప్రోత్సహించేందుకు ప్రణాళిక రూపొందించింది. పరికరాల సరఫరా నిమిత్తం 24 కంపెనీలను ఎంపిక చేసింది.



తుంపర సేద్యం

మండలాల వారీగా బిందు సేద్యం సాగు లక్ష్యాలు...

మండలం	లక్ష్యం (హెక్టార్లలో)	ఇప్పటివరకు దరఖాస్తు చేసిన రైతులు
ఒంగోలు	75	39
కొత్తపట్నం	525	441
సంతనూతలపాడు	225	132
మద్దిపాడు	2251	111
నాగులుప్పలపాడు	150	44
చీమకుర్తి	300	270


చీమకుర్తి: హరిహర క్షేత్రంలో...


కామాక్షీ దేవిగా..


ఉప్పుగుండూరు: రూ.40 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరణ


లలితా త్రిపురసందరిగా జ్వాలాముఖి

పాహిమాం... పరమేశ్వరి

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. సోమవారం... ఆయా ఆలయాల్లో కొలువుదీరిన అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కుంకుమ పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆయా ప్రాంగణాల్లో నిర్వహించిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

– న్యూస్‌టుడే బృందం


సీతారామపురంలో...


చెన్నకేశవస్వామి ఆలయంలో సంతానలక్ష్మిగా


లాయర్‌పేట: బాబా మందిరంలో...


కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో అన్నపూర్ణగా...

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: మీ కోసం అర్జీల పరిష్కారం పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరించారు. స్థానిక ప్రకాశం భవన్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన మీ కోసంలో ఆమె వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్థానికంగా పరిష్కారమయ్యే సమస్యలను స్థానికంగానే పరిష్కరించాలని సూచించారు. అర్జీదారులతో మాట్లాడిన ఫొటోలతోపాటు, పరిష్కరించిన ఎండార్స్‌మెంట్‌ను కూడా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. పలు సమస్యలపై 241 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో శ్రీలత, ఎస్‌డీసీలు ఝాన్సీలక్ష్మి, వెంకట సునీల్, వరకుమార్‌తోపాటు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ, ఇతర అధికారులు

● **మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు పంపండి..**: ఎస్సీ నివాస ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధిత కార్యాచరణ ప్రతిపాదనలను తయారు చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రకాశం భవన్‌లో డిసెంబర్ నెలాఖరులోపు మౌలిక సదుపాయాల కల్పన కార్యాచరణపై సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రధాన రహదారులను కలిపే కాంక్రీట్ రోడ్లు, మురుగు కాలువలు, సురక్షిత తాగునీరు, గృహనిర్మాణం వంటి అంతరాలు ఉన్నాయన్నారు. క్షేత్ర స్థాయి సమాచారం పంపించేందుకు ఈ నెల 15వ తేదీ తుది గడువు అని తెలిపారు. సమావేశంలో జేసీ గోపాలకృష్ణ, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి లక్ష్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 54...


ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం అదనపు ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమానికి 54 వినతులు వచ్చాయి. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలను వివరించారు. వారితో అదనపు ఎస్పీ ముఖాముఖి మాట్లాడి, అర్జీలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, తాలూకా సీఐ కె.అజయ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు పాల్గొన్నారు.

గుండ్లకమ్మ కాలువ ఆక్రమణపై ఫిర్యాదు

ఒంగోలు గ్రామీణం: మాజీ ఎమ్మెల్యే టీజేఆర్.సుధాకర్‌బాబు గుండ్లకమ్మ కాలువ ఆక్రమించి అతిథిగృహం, దుకాణ సముదాయం నిర్మిస్తున్నారని నాగులుప్పలపాడు మండలం మద్దిరాల ముప్పాళ్ల గ్రామానికి చెందిన జెట్టి చెన్నకేశవ సోమవారం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేశారు. మద్దిపాడు మండలం మల్లవరంలోని సర్వే నం.69, 238, 239లో మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సోనియా చార్లీ గ్లోబల్ బిజినెస్ సంస్థ పేరిట భూములు కొనుగోలు చేసి గుండ్లకమ్మ కాలువలను ఆక్రమించి, దుకాణ సముదాయం, పెద్ద బంగళాలను నిర్మించినట్లు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సదరు ఆక్రమణల ద్వారా నీటి ప్రవాహం తగ్గి, రైతులకు ఇబ్బంది ఏర్పడినట్లు వివరించారు. ఆయా నిర్మాణాల పక్కనే ఉన్న దేవాదాయ భూములను కూడా ఆక్రమించినట్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తక్షణమే సర్వే చేయించి, అక్రమ నిర్మాణాలను తొలగించాలని కోరారు.

ఏడాదంతా పంట... భలే లాభాలంట!

న్యూస్‌టుడే – దర్శి



సాధారణంగా పుచ్చ పంటకు జనవరి నెలలో విత్తనాలు నాటి... వేసవిలో దిగుబడి వచ్చేలా రైతులు సాగు చేస్తుంటారు. ఇందుకు భిన్నంగా ఏడాదిలో మూడు సార్లు సాగు చేస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నారు... కురిచేడు గ్రామానికి చెందిన రైతులు **మేరువ సుబ్బారెడ్డి, కమతం నాగిరెడ్డి.** గత ఏడాదే ప్రయోగాత్మకంగా నాలుగు ఎకరాల్లో ఈ విధానానికి శ్రీకారం చుట్టారు. ఫలితాలు బాగుండడంతో ఈ ఏడాది మరో ఆరు ఎకరాలకు విస్తరించారు.

▶ **ప్రతి నాలుగు నెలలకోసారి...:** ఓసారి తోట వేసి దిగుబడి పూర్తయిన తరువాత మొత్తం పొలాన్ని శుభ్రం చేసి... పశువుల ఎరువుతో నేలను సత్తువ చేసి మళ్లీ విత్తనాలు వేస్తున్నారు. ఇలా ప్రతి నాలుగు నెలలకు ఓసారి చొప్పున ఏడాదికి మూడు పంటలు వేస్తున్నారు. పల్నాడు జిల్లా వినుకొండలో ఐస్‌బాక్స్ (నల్ల పుచ్చ) రకం విత్తనాలు సేకరించి... మల్చింగ్ విధానంలో నాటుతున్నారు. పంట అంతటికీ సమంగా నీరందేలా డ్రిప్ ఏర్పాటు చేశారు. బలం మందులు సైతం దాని ద్వారానే అందిస్తున్నారు. పుచ్చలో అధికంగా వచ్చే పండు ఈగ నివారణకు లింగాకర్షక బుట్టలు, రసం పీల్చే పురుగు, వైరస్ తెగుళ్లు ఆశించకుండా జిగురు అట్టలతో పాటు స్వల్ప మోతాదులో రసాయన మందులు వినియోగించారు. ఎక్కువ శాతం సేంద్రియ ఎరువులే వాడారు. ఈ చర్యలు ఫలించి మంచి పరిమాణంతో నాణ్యమైన కాయలు దిగుబడిగా వచ్చాయి. సాధారణంతో పోలిస్తే 30 శాతం మేర పెట్టుబడి ఖర్చులు తగ్గినట్లు రైతులు తెలిపారు.


▶ **పొలం వద్దే కొనుగోళ్లు...:** ఎకరాకు సగటున 18 టన్నుల మేర దిగుబడి సాధించారు. మార్కెట్‌లో టన్ను ధర రూ.14 వేలు పలకడంతో మంచి ఆదాయం లభించింది. ఎకరాకు మొత్తంగా రూ.70 వేల వరకు పెట్టుబడి కాగా... పంట అమ్మకం ద్వారా రూ.2 లక్షల మేర ఆదాయం వచ్చిందని రైతులు వివరించారు. ఆశాజనకంగా ఉండడంతో ఈ ఏడాది మరో ఆరు ఎకరాలకు సాగు విస్తరించారు. మరో పక్షం రోజుల్లో ఆ పంట కోతకు రానుంది. దిల్లీ, చెన్నై, హైదరాబాద్ వంటి పట్టణాల్లో ఉన్న బహుళజాతి సంస్థల మాల్‌లకు సంబంధించిన ప్రతినిధులు నేరుగా పొలం వద్దకే వచ్చిన కొనుగోలు చేస్తున్నారు. దీనివల్ల కోత, రవాణా ఖర్చులు ఆదా అవుతున్నాయి.

సమస్య పరిష్కారం

▶ **సమస్య:** మందలోని కొన్ని గొర్రెలకు నోటి పుండ్లు వచ్చి మేత సరిగా తినలేక పోతున్నాయి. నివారణ ఎలా?

– వేల్పుల అంకమ్మరావు, మద్దిపాడు

పరిష్కారం: పుండ్లపై బోరిక్ ఆమ్లం పూస్తే కొంత ఉపశమనం కలుగుతుంది. పూర్తిగా తగ్గేందుకు యాంటీ బయాటిక్ మందులు వాడాలి. నీరసం పడకుండా అంబలి, గంజి, నీరు ఎక్కువగా తాగించాలి.


డి.తిరుమలరెడ్డి, పశు వైద్యాధికారి, దొడ్డవరప్పాడు

▶ **సమస్య:** పది రోజుల వయసున్న గేదె దూడ పారుతూ నీరసంగా ఉంటోంది. ఏం చేయాలి?


– ముచ్చు అంజయ్య, వెల్లంపల్లి

సమాధానం: దూడ శరీర బరువుకు పది శాతం నిష్పత్తిలో పాలు తాగిస్తే... రోగ నిరోధక శక్తి పెరిగి ఈ తరహా సమస్యలు తలెత్తవు. మట్టి తినకుండా జాగ్రత్త వహించాలి. నెల రోజుల వయసులో డీవార్మింగ్ మందులు వాడాలి.

– న్యూస్‌టుడే, మద్దిపాడు

రైతేరాజు

ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించే క్రమంలో ఈ ఏడాది కొత్తగా పనస, చింత తోటల సాగుకు ప్రభుత్వం రాయితీలు అందిస్తున్నట్లు కంభం ఉద్యాన శాఖ అధికారిణి శ్వేత తెలిపారు. హెక్టారుకు తొలి ఏడాది రూ.18 వేలు; తరువాత రెండేళ్ల పాటు ఏడాదికి రూ.ఆరు వేలు చొప్పున మొత్తంగా రూ.30 వేల సాయం అందిస్తారని చెప్పారు. జిల్లాలోని నేలలు ఈ సాగుకు అనుకూలమని... ఆసక్తి గల రైతులు ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.



చింత, పనస తోటల సాగుకు ప్రోత్సాహం

మీ కోసం

▶ **పనస...** హెక్టారుకు వంద మొక్కలు నాటవచ్చు. రెండేళ్ల నుంచే కాపు ఆరంభమవుతుంది. సస్యరక్షణ చర్యలను బట్టి 30 నుంచి 60 ఏళ్ల వరకు దిగుబడి తీయవచ్చు. తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాల్లోనూ సాగు చేయవచ్చు. ఈ పండ్లతో పాటు ఆకులు, కొమ్మలు, కలపకు విలువ ఉంది. పురుగు, తెగుళ్ల సమస్యలు పెద్దగా ఉండవు. ఇతర పండ్ల తోటలతో పోలిస్తే ఆర్థికంగా లాభదాయకంగా ఉంటుంది. విటమిన్ ఎ, బి, సి, పొటాషియం, కాల్షియం, ఐరన్, ప్రొటీన్లు సమృద్ధిగా ఉండే పండు ఇది.

▶ **చింత...** తక్కువ వర్షపాతం ఉన్న కరవు నేలల్లోనూ సాగు చేయవచ్చు. హెక్టారు వంద మొక్కలు నాటవచ్చు. నాలుగేళ్ల నుంచి దిగుబడి ప్రారంభమవుతుంది. తొమ్మిదేళ్ల నుంచి పూర్తిస్థాయిలో ఫలసాయం అందిస్తుంది. యాభై ఏళ్ల వరకు మంచి దిగుబడి ఉంటుంది. రాళ్లు, మెట్ట భూముల్లోనూ సాగు చేయవచ్చు.

– న్యూస్‌టుడే, వేస్తవారపేట గ్రామీణం

రైతులకు కూలీల కొరత గుదిబండలా మారింది. సమయానికి ఎవరూ దొరక్క... ఇతర ప్రాంతాల నుంచి రప్పించాల్సి వస్తోంది. ఇందుకోసం అధిక మొత్తం వెచ్చించాల్సి వస్తోంది. ఒక్కోసారి వారూ దొరక్క పంట నష్టం చవిచూడాల్సి వస్తోంది. యంత్రపరికరాల వినియోగంతో ఈ సమస్యను అధిగమించవచ్చని జిల్లా ఉద్యాన శాఖ అధికారి గోపీచంద్ తెలిపారు. ప్రభుత్వం రాయితీపై వాటిని అందిస్తోందని... కర్షకులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. –న్యూస్‌టుడే, కంభం

యంత్రం... కూలీల కొరతకు పరిష్కారం

▶ **మినీ ట్రాక్టర్...** అయిదెకరాల్లోపు పొలం ఉన్న వారికి రూ.లక్ష; అంతకంటే ఎక్కువ భూమి ఉన్న వారికి రూ.75 వేల రాయితీపై ఇస్తున్నారు. 20 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన ట్రాక్టర్లు జిల్లాకు 50 మంజూరు చేశారు.

▶ **బిందు సేద్యం పరికరాలు...** అయిదెకరాల్లోపు భూమి ఉన్న రైతులకు 90 శాతం రాయితీపై అందిస్తున్నారు.

▶ **తుంపర సేద్యం పరికరాలు...** అయిదెకరాల్లోపు కర్షకులకు 55 శాతం; 5 నుంచి 12 ఎకరాల్లోపు ఉంటే 45 శాతం రాయితీపై ఇస్తున్నారు.

▶ బత్తాయిలో కొమ్మ కత్తిరింపు, బోర్డో పేస్టు పూయడం, పాదుల ఏర్పాటు, ఎండుపుల్ల కత్తిరింపునకు హెక్టారుకు రూ.17,380 చొప్పున అందిస్తున్నారు. జిల్లాలో 60 హెక్టార్లకు అనుమతులు ఇచ్చారు. ఎనిమిదేళ్లకు పైగా వయసు ఉన్న తోటలకు మాత్రమే ఇది వర్తిస్తుంది.


మినీ ట్రాక్టర్


ట్రాక్టర్ మౌంటెడ్ స్ప్రేయర్

పరికరం	సామర్థ్యం	మంజూరైన యూనిట్లు	రాయితీ (రూ.ల్లో)
పవర్ టిల్లర్	8 బీహెచ్‌పీ కంటే తక్కువ	5	40 వేలు
పవర్ టిల్లర్	8 బీహెచ్‌పీ కంటే ఎక్కువ	5	60 వేలు
ట్రాక్టర్ మౌంటెడ్ స్ప్రేయర్లు	20 బీహెచ్‌పీ కంటే తక్కువ	3	8 వేలు
ట్రాక్టర్ మౌంటెడ్ స్ప్రేయర్లు	35 బీహెచ్‌పీ కంటే ఎక్కువ	5	50 వేలు
డ్రైవాన్ స్ప్రేయర్లు	16 లీటర్లు	280	10 వేలు
మల్చింగ్ షీట్ పరిచే యంత్రం	-	4	28 వేలు
మొక్క, విత్తనం నాటే పరికరాలు	-	2	12 వేలు

బదిలీల అక్రమాలపై విచారణ

ఈనాడు కథనానికి స్పందన

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామ సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియకు సంబంధించి 'ఈనాడు'లో ఆదివారం 'నగదు ఇవ్వు.. లేఖ తీసుకెళ్లు' శీర్షికన ప్రచురితమైన కథనంపై కలెక్టర్ తమీమ్ అన్సారియా విచారణకు ఆదేశించారు. ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారి లోకేశ్వరరావు స్థానిక కలెక్టరేట్‌లోని డీపీవో కార్యాలయంలో సోమవారం విచారించారు. డీపీవో ఉషారాణి, పూర్వ ఏవో శివప్రసాద్, కార్యాలయ ఉద్యోగి కిషోర్‌తోపాటు, పూర్వ ఉద్యోగి సాయిను విచారించి వారి వద్ద నుంచి స్టేట్‌మెంట్ నమోదు చేసినట్లు సమాచారం. గ్రేడ్-5, గ్రేడ్-6 కార్యదర్శుల బదిలీల్లో నెలకొన్న జాప్యం, వారి నుంచి నగదు వసూళ్లు, అందులో ఎవరి పాత్ర ఉందన్న తదితర అంశాలపై ఆరా తీశారు.

జాతీయస్థాయి దివ్యాంగ క్రికెట్ పోటీలకు ఎంపిక

దర్శి, న్యూస్‌టుడే: దర్శి క్రిస్టియన్‌పాలేనికి చెందిన వేల్పుల విజయకుమార్ జాతీయ స్థాయి దివ్యాంగ టి-20 క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన ఆయన పోలియో కారణంగా వైకల్యం ఉంది. ప్రస్తుతం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో ఒప్పంద విధానంలో మేల్ స్టాఫ్ నర్సుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. సెప్టెంబర్ 15-17 తేదీల్లో ఒంగోలులో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 15 నుంచి 25 వరకు రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో జరిగే జాతీయస్థాయి టి-20 పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున ఆడనున్నట్లు విజయకుమార్ వివరించారు. గతంలో చైనాలో జరిగిన పారా ఒలంపిక్ పోటీల్లో బీచ్ వాలీబాల్‌లోనూ తలపడినట్లు ఆయన తెలిపారు.


విజయకుమార్

వేతనాలు చెల్లించాలని సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ జిల్లా సమగ్ర శిక్షా ఉద్యోగులు స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా కన్వీనర్ మహేష్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో 22 రోజులపాటు ఉద్యోగుల సమ్మెలో భాగంగా చేసిన హామీలు అమలు కాలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశించామన్నారు. నెలల తరబడి వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సింగయ్య, మాధవాచారి, వినయ్, శ్రీదేవి, కవిత తదితరులు పాల్గొన్నారు.

వంద బస్తాల చౌక బియ్యం పట్టివేత

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి శివారు హరిహర క్షేత్రం వద్ద విజిలెన్స్ బృందం నిర్వహించిన తనిఖీల్లో సంతనూతలపాడు వైపు తరలిస్తున్న 100 బస్తాల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. ఆటోతో పాటు లారీలో బియ్యం తీసుకెళ్తుండగా పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. చీమకుర్తిలోని పలు చౌక దుకాణాల నుంచి సంతనూతలపాడుకు ఈ బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం. బియ్యాన్ని ఎంఎల్‌ఎస్ గోదాముకు తరలించి వాహనాన్ని సీజ్ చేశారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేజీబీవీల్లో బోధనేతర సిబ్బంది భర్తీకి దరఖాస్తులు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న 52 బోధనేతర సిబ్బంది పోస్టులను భర్తీ చేయడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఈవో డి.సుభద్ర సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో 2024-25 విద్యా సంవత్సర కాలానికి విధుల్లోకి తీసుకుంటారన్నారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు సోమవారం నుంచి ఈ నెల 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నేరుగా డీఈవో కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వాలన్నారు. జిల్లా వ్యాప్తంగా టైప్-3 కేజీబీవీల్లో హెడ్‌కుక్ ఏడు, అసిస్టెంట్ కుక్ 18, నైట్‌వాచ్ ఉమెన్ ఆరు, స్కావెంజర్ అయిదు, స్వీపర్ ఆరు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. టైప్-4 కేజీబీవీల్లో పది పోస్టులకు గాను హెడ్‌కుక్ మూడు, అసిస్టెంట్ కుక్ మూడు, చౌకీదార్ నాలుగు పోస్టులు భర్తీ చేస్తారని తెలిపారు. ఈ నెల 18న జిల్లా స్థాయిలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల జాబితా తయారీ అనంతరం 21న ఆమోదం కోసం జిల్లాస్థాయి ఎంపిక కమిటీకి సమర్పిస్తారన్నారు. రాష్ట్ర కార్యాలయంలో ఎంపిక జరుగుతుందన్నారు. జులై ఒకటి 2024 నాటికి ఓసీలు అయితే 42 సంవత్సరాలు, మాజీ సైనికోద్యోగులు 45 సంవత్సరాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీకి 47 సంవత్సరాలు, పీహెచ్‌సీ అభ్యర్థులకు 52 సంవత్సరాలు సడలింపు ఉందన్నారు. వాచ్‌ఉమెన్ పోస్టుకు మాత్రం ఏడోతరగతి విద్యార్హత ఉండాలన్నారు.

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచిత డీఎస్సీ శిక్షణ

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల సంయుక్తంగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానంలో ఉచిత డీఎస్సీ శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి ఎన్.లక్ష్మానాయక్ తెలిపారు. ఎంపిక చేసిన శిక్షణ సంస్థలు, సంక్షేమ శాఖలు నిర్వహిస్తున్న స్టడీ సర్కిల్‌లో తర్ఫీదు ఇస్తారన్నారు. దరఖాస్తు చేసుకునే శిక్షణ సంస్థలు కనీసం రెండు డీఎస్సీ రిక్రూట్‌మెంట్లకు కోచింగ్ ఇచ్చి ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న సంస్థలు ఈ నెల 21 లోపు దరఖాస్తు చేసుకోవాలని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

భూ సమస్యల పైనే ఎక్కువ వినతులు

సింగరాయకొండ గ్రామీణం: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి అన్నారు. సింగరాయకొండ మండల పరిషత్తు కార్యాలయంలో తహసీల్దార్ రవి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మొత్తం 90 వినతులు రాగా, అధికంగా భూ సమస్యలపైనే ఉన్నాయన్నారు. అయిదేళ్ల వైకాపా పాలనలో ఆ పార్టీ నేతలు నిరుపేదలకు చెందిన ఇళ్ల స్థలాలు, ప్రభుత్వ భూములను ఆక్రమించి, లేఅవుట్లు వేసి రూ.కోట్లు దోచుకున్నారని తెలిపారు. సింగరాయకొండ ప్రధాన రహదారి ఇరువైపులా ఉన్న కాలువల ఆక్రమణలు తొలగించాలని, ఇతర సమస్యలను గ్రామస్థులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్తు సమస్యలు పరిష్కారం కాకపోవడంపై అధికారుల తీరుపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో అభివృద్ధి పనులకు రూ.140 కోట్లు మంజూరయ్యాయని, ఈ నెల 14వ పల్లెపండుగ కార్యక్రమం ద్వారా ప్రారంభిస్తామన్నారు. కొండపి నియోజకవర్గంలో రూ.17 కోట్లు మంజూరైనట్లు వివరించారు. అనంతరం కనుమళ్ల జాతీయ రహదారి వద్ద బ్రిడ్జ్ సాల్టు గుర్తించి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆర్డీవో లక్ష్మీప్రసన్న, ఎంపీడీవో జయమణి, సీఐ హజరత్తయ్య, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి స్వామి, వేదికపై అధికారులు


ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన

ఆదివాసీ ప్రాంతాల్లో దాడులు ఆపాలంటూ ధర్నా

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్ దండ కారణ్య ప్రాంతాల్లో జనవరి ఒకటో తేదీ నుంచి కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న డ్రోన్, వైమానిక దాడులను తక్షణమే ఆపేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదిక రాష్ట్ర కన్వీనర్ చిలుక చంద్రశేఖర్ మాట్లాడుతూ.. రోజుకి పదుల సంఖ్యలో ఆదివాసీలు, మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అడవుల్లోని ఖనిజ సంపదను దోచుకునే కార్పొరేట్ కంపెనీలతో మైనింగ్ ఒప్పందాలను అమలు చేయడానికి కేంద్రం అటవీ చట్టాలను సవరించినట్లు ఆరోపించారు. కార్పొరేటర్లకు అనుకూలమైన ఆపరేషన్ కగార్‌ను రద్దు చేయడంతోపాటు, ఇప్పటి వరకు జరిగిన ఆదివాసీల హత్యాకాండపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అక్కడ ఉన్న మిలిటరీ శిబిరాలను ఎత్తివేయడంతోపాటు, అటవీ చట్టాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు చావలి సుధాకర్, ఎం.ఎల్.నారాయణ, మోహన్, యు.వెంకటేశ్వర్లు, జి.కల్యాణరావు, మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పీఎఫ్ సమస్య పరిష్కరించాలని వినతి

ఒంగోలు గ్రామీణం: ఉపాధ్యాయ, ఉద్యోగుల జడ్పీ పీఎఫ్ క్లోజర్స్, రుణాలు, స్లిప్పుల జారీ చేయడం తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం జడ్పీ సీఈవో చిరంజీవికి వినతిపత్రం అందజేశారు. 2023-24 పీఎఫ్ స్లిప్పులు ఇంకా ఇవ్వని ఉన్నత పాఠశాలలు, మండలాలకు వెంటనే ఇవ్వాలని కోరారు. స్లిప్పులు ఆన్‌లైన్ చేయడంతోపాటు, పీఎఫ్ క్లోజర్స్, రుణాలను సీఎఫ్‌ఎంఎస్‌కు అప్‌లోడ్ చేయాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సంఘం నాయకులు వి.జనార్దన్‌రెడ్డి, డి.శ్రీనివాసులు, బి.శేషారావు, కె.రవి, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో అలసత్వం తగదు

మద్దిపాడు, న్యూస్‌టుడే: రేషన్ పంపిణీలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ సుజన్ కుమార్ హెచ్చరించారు. రేషన్ డీలర్లతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెలలో సరకుల పంపిణీలో మండలం వెనుకబడిందని... ఈసారి ఆ పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్ఐ రమణయ్య, సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరావు పాల్గొన్నారు.

● **డిప్యూటీ తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ:** మద్దిపాడు: మండల డీటీగా ఆజయ్‌కుమార్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఒంగోలు నుంచి బదిలీపై వచ్చారు.

నేడు, రేపు ఉప సర్పంచులకు శిక్షణ: మద్దిపాడు, న్యూస్‌టుడే: ఉప సర్పంచి, వార్డు సభ్యులకు మంగళ, బుధవారాల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జ్యోతి తెలిపారు. గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై అవగాహన కల్పిస్తారని తెలిపారు.

చౌక దుకాణాల డీలర్లపై కేసులు: చీమకుర్తి, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆరు, మండలంలోని మంచికలపాడు, నేకునంబాదు చౌక ధరల దుకాణాల డీలర్లపై 6ఏ కేసులు నమోదు చేశారు. వివిధ విభాగాలకు చెందిన అధికారులు గత రెండు రోజులుగా ఆయా దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. లోపాలు గుర్తించి కేసులు నమోదు చేశారు.

బాణసంచా దుకాణం జప్తు: మద్దిపాడు: కొష్టాలు - నేలటూరు మార్గంలో ఉన్న బాణసంచా దుకాణాన్ని మద్దిపాడు పోలీసులు సోమవారం జప్తు చేశారు. నిబంధనలు పాటించకపోవడంతో రెవెన్యూ సిబ్బందితో కలిసి ఈ చర్యలు తీసుకున్నట్లు ఎస్సై శివరామయ్య తెలిపారు. తనిఖీల్లో రైటర్ ఉమ, వీఆర్వో రమణ, వీఆర్ఏ సావిత్రి పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు: మద్దిపాడు: కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్న జిల్లా మలేరియా అధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్ సూచన మేరకు... బూరేపల్లిలో వైద్యసిబ్బంది సోమవారం ఫాగింగ్ నిర్వహించారు. సర్పంచ్ శేషయ్య అంజమ్మ, మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 123, రిటైల్ లైవ్ - 145, చికెన్ విత్ స్కిన్ - 210, చికెన్ స్కిన్‌లెస్- 239